

రీ గ్రూపింగ్‌తో అయోమయం

- నాలుగో వంతు ఉద్యోగుల మిగులు
- మహిళా పోలీసులు తప్ప అందరూ బిజీ
- పర్యవేక్షణ లేక కరువైన సమయపాలన
- గందరగోళంగా సచివాలయ వ్యవస్థ



పెనుమూరు సచివాలయానికి సేవల కోసం వచ్చిన ప్రజలు

చిత్తూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సచివాలయ వ్యవస్థను ప్రక్షాళన చేయడంలో భాగంగా కూటమి ప్రభుత్వం రీగ్రూపింగ్‌ను అమలు చేసింది. ఇందులో భాగంగా అమలులోకి తెచ్చిన క్లస్టర్ విధానం కూడా గందరగోళంగా మారింది. జిల్లాలో ఏకంగా నాలుగో వంతు సచివాలయ ఉద్యోగులు నో పొజిషన్‌లో అంటే, మిగులుగా ఉన్నారు.

రీ గ్రూపింగ్‌తో 310 క్లస్టర్లు

సచివాలయాలను క్లస్టర్లుగా విభజించారు. చిత్తూరు జిల్లాలో ఉన్న 612 సచివాలయాలను 310 క్లస్టర్లుగా వర్గీకరించారు. అలాగే, జనాభాను బట్టి సచివాలయాల స్థాయిని విభజించారు. 2500 మంది కంటే తక్కువ జనాభా ఉంటే ఆరుగురు, 2501-3500 మంది ఉంటే ఏడుగురు, 3501 మంది కంటే ఎక్కువ జనాభా ఉంటే 8 మంది సిబ్బంది పనిచేయాల్సి ఉంటుంది.

సమయపాలన ఏదీ?

నిర్దిష్ట పర్యవేక్షణ వ్యవస్థ లేకపోవడంతో సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించడం లేదు. కొంతమంది ఉదయం ఆలస్యంగా వస్తే, మరికొందరు ఫీల్డ్ విజిట్ పేరుతో మధ్యాహ్నం తర్వాత సచివాలయాల్లో కనిపించడం లేదు.దీంతో వారి కోసం వచ్చిన ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. వైసీపీ హయాంలో కూడా పర్యవేక్షణ వ్యవస్థ ఉండేదికాదు. రీగ్రూపింగ్‌లో భాగంగా కూటమి ప్రభుత్వం పర్యవేక్షణను పటిష్టం చేయనుంది. జిల్లా స్థాయిలో డీఎల్‌డీవోను, మండల స్థాయిలో డిప్యూటీ ఎంపీడీవోలను నియమించనుంది. జిల్లాలో ఈ ప్రక్రియ పూర్తి కాలేదు.

మహిళా పోలీసుల భవితవ్యం ప్రశ్నార్థకం

సచివాలయాల్లో ఉద్యోగులందరికీ పని ఉండాలని కూటమి ప్రభుత్వం రీ గ్రూపింగ్ చేసినా మహిళా పోలీసులకు మాత్రం నిర్దిష్టమైన పనిలేదు. వీళ్లను పోలీసుశాఖకు పంపిద్దామంటే, వీరికి పోలీసుల తరహాలో ఎంపిక ప్రక్రియ, శిక్షణ లేదని ఆ శాఖ ఒప్పుకోవడం లేదు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లా మారుద్దామంటే తమ ప్రమోషన్లు ఆగిపోతాయని అంగన్‌వాడీ టీచర్లు అడ్డు పడుతున్నారు. రీగ్రూపింగ్ తర్వాత జిల్లాలో ఏకంగా 346 మంది మహిళా పోలీసులు మిగులుగా ఉన్నారు. వీరు తప్ప మిగిలిన ఉద్యోగులంతా బిజీగా ఉంటున్నారు.

వలంటీర్లు లేకున్నా ఇబ్బంది లేదు

వైసీపీ హయాంలో పనిచేసిన వలంటీర్లు సచివాలయాల్లో రాజకీయాలు చేసేవారు.సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపికలో జోక్యం చేసుకుని ఉద్యోగుల్ని సైతం ఇబ్బంది పెట్టేవారు. ఇప్పుడు ఆ సమస్య లేదు. వారు లేకపోయినా ఎప్పటిలాగే పెన్షన్ పంపిణీ కార్యక్రమానికి ఎలాంటి ఇబ్బంది కలగడం లేదు.

మిగులు ఉద్యోగులు 917మంది

జిల్లాలో 3269 మంది గ్రామ, 819 మంది వార్డు సచివాలయాల ఉద్యోగులు పనిచేస్తున్నారు. రీగ్రూపింగులో భాగంగా ఒక్కో ఉద్యోగి రెండు సచివాలయాల్లో (క్లస్టర్) పనిచేస్తున్నారు. దీంతో ప్రస్తుతం 917 మంది ఉద్యోగులు మిగులుగా ఉన్నారు. వీరిలో మహిళా పోలీసులు 304 మంది గ్రామాల్లో, 42 మంది పట్టణాల్లో మిగిలిపోయారు. అలాగే 64 మంది పంచాయతీ కార్యదర్శులు, 75 మంది డిజిటల్, 30మంది వెల్ఫేర్ అసిస్టెంట్లు మిగిలిపోయి ఉన్నారు. వీరందరూ మిగులు అయినా ఆయా ప్రాంతాల్లో పనులు చేయించుకుని జీతాలు ఇస్తున్నారు.

సచివాలయ వ్యవస్థ స్వరూపం

- మొత్తం సచివాలయాలు: 612
- పనిచేస్తున్న ఉద్యోగులు: 4088
- గ్రామ సచివాలయాలు: 504
- ఉద్యోగులు: 3269
- వార్డు సచివాలయాలు: 108
- ఉద్యోగులు: 819
- రీగ్రూపింగ్ తర్వాత ఏర్పడిన క్లస్టర్లు: 310
- మిగులు ఉద్యోగులు: 917.

తిమ్మసముద్రంలో ఇంటి తాళాన్ని లబ్ధిదారుకు అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే



పండుగలా గృహప్రవేశాలు

- జిల్లావ్యాప్తంగా 10,168మందికి సొంతింటి తాళాలు
- కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు
- నూతనంగా 2472 గృహాల మంజూరు

చిత్తూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): 2029 నాటికి ప్రతి పేదవాడికీ సొంతిల్లు ఉండాలనే ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా బుధవారం జిల్లావ్యాప్తంగా పండుగలా గృహ ప్రవేశాల కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నమయ్య జిల్లా చిన్నమండెం మండలం దేవగుడిపల్లెలో సీఎం చంద్రబాబు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా, జిల్లాలోనూ వివిధ ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.వైసీపీ హయాంలో యూనిట్ కాస్ట్ రూ.1.80 లక్షలు సరిపోక చాలామంది ఇండ్లు మంజూరైనా నిర్మించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75వేలను అదనంగా కేటాయించి ప్రోత్సహించింది. ఈ 17 నెలల కాలంలో ప్రభుత్వ ప్రోత్సాహంతో జిల్లాలో 10,168 మంది ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేసుకున్నారు. వీటితో పాటు కొత్తగా 5 మున్సిపాలిటీల్లో, పలమనేరు నియోజకవర్గంలో కలిపి 2472 పక్కా గృహాలను మంజూరు చేశారు.చిత్తూరు నగరం తిమ్మసముద్రం ప్రాంతంలో జరిగిన గృహప్రవేశాల కార్యక్రమంలో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, చుడా ఛైర్‌పర్సన్ హేమలత, మేయర్ అముద, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు తదితరులు పాల్గొన్నారు. రామకుప్పం మండలంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పీకేఎం ఉడా ఛైర్మన్ సురేశ్ బాబు, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నం, టీటీడీ బోర్డు మెంబర్ శాంతారాంతదితరులు హాజరయ్యారు. పూతలపట్టు మండలం పి.కొత్తకోటలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మురళీమోహన్, నగరిలోని చింతలపట్టెడలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, హౌసింగ్ పీడీ సుబ్రమణ్యం పాల్గొన్నారు. రొంపిచెర్లలో హౌసింగ్ డీఈ యోగానంద నాయుడు, టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లో లబ్ధిదారులతో మాట్లాడి వారి వారి ఇండ్ల తాళాలను అప్పగించారు.

పులిరాజా.. నువ్వెక్కడ?

శేషాచలంలో తొలిసారి పులుల గణన
డిసెంబరులో మొదలు
ఏర్పాట్లు చేసుకుంటున్న అటవీశాఖ



మంగళం, ఆంధ్రజ్యోతి

శేషాచలంలో పెద్దపులి కోసం తొలిసారి అన్వేషణ మొదలవుతోంది. దేశవ్యాప్తంగా అన్ని అడవుల్లోనూ డిసెంబరులో జరిగే పులుల గణన కార్యక్రమం శేషాచలం లోనూ ఈసారి జరగనుంది. నాలుగేళ్లకు ఒకసారి మాత్రమే పులుల సంఖ్యను లెక్కిస్తారు. నల్లమల అడవులను మాత్రమే ఆవాసంగా చేసుకున్న పెద్దపులి జాడ శేషాచలం సమీపంలో కొన్నేళ్లుగా కనిపించడమే ఇందుకు కారణం. 2017లో చామల రేంజ్ (నల్లమల అటవీప్రాంతం)లో ఒక మగపులి కనిపించింది. నాగార్జునసాగర్ రిజర్వ్ నుంచి ప్రకాశం జిల్లా గిద్దలూరు సమీపంలోని నల్లమల, శేషాచలం కొండల మధ్య ఉన్న టైగర్‌కారిడార్‌లోకి పెద్దపులి ప్రవేశించిందని అప్పుడు గుర్తించారు. అలాగే ఈ ఏడాది ఆగస్టు నెలలో శేషాచల అడవులకు ఆనుకుని ఉన్న అన్నమయ్య జిల్లాలోని చిట్వేలి అడవుల్లోకూడా పెద్దపులి కనిపించింది. ఇక్కడ ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాల్లో పగటిపూట, సాయంత్రం సమయాల్లో పులి తిరుగుతున్నట్టు రికార్డు అయింది. దాదాపు వందేళ్ల తరువాత ఈ ప్రాంతంలో పెద్దపులి కనిపించడం విశేషం. నల్లమల నుంచి వచ్చిన పెద్దపులులు శేషాచలంలో ఎన్ని ఉన్నాయో ఈ లెక్కింపు ప్రక్రియలో తేలనుంది.

300 ట్రాప్ కెమెరాలు

తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో పులుల గణన కోసం 300 ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. రేంజ్ విస్తీర్ణం బట్టి 20 నుంచి 30 కెమెరాలు పెడుతారు.ఇక్కడ 15మంది సిబ్బందిని ఏర్పాటు చేస్తారు. ట్రాప్ కెమెరాల ద్వారా పెద్దపులితో పాటూ ఇతర జంతువుల లెక్కింపు కూడా జరుగుతుంది.

పులులు ఎలా లెక్కిస్తారంటే..

ట్రాప్ కెమెరాలు
అడవిలోని వివిధప్రాంతాల్లో కెమెరాలను ఏర్పాటు చేస్తారు. పులులు కదలిక కనిపించినపుడు కెమెరాలు గుర్తించి ఫోటోలు తీస్తాయి.

పాదముద్రలు
అడవుల్లో పులుల పాదముద్రల కోసం అన్వేషిస్తారు. వాటిని గుర్తించడం ద్వారా పులి పరిమాణం, ఆకారం , వయసు అంచనా వేస్తారు.

వెంట్రుకలు, గోళ్లు
పులులు తిరిగిన ప్రదేశాల్లోనూ, ఆవాసంగా చేసుకున్న తావుల్లోనూ వెంట్రుకలు, గోళ్లు సేకరిస్తారు. వీటిని డీఎన్‌ఏ పరీక్షలు కోసం పంపుతారు.ఈ నమూనాల ద్వారా పులుల సమగ్ర సమాచారం నిర్ధారిస్తారు.

భూభాగ విశ్లేషణ
పులులు నివసించే ప్రాంతాలను ముందుగా గుర్తిస్తారు. ఆ ప్రాంతాల్లోని ఇతర జంతువుల సంఖ్యను అంచనా వేస్తారు. పులికి ఆహారంగా ఉండే జంతువుల సంఖ్య ఎక్కువగా ఉన్న ప్రాంతానే పులి ఆవాసంగా ఎంచుకుంటుంది.

అబ్బుగుండులో చిరుత సంచారం



చిరుత పాదముద్రలు

ఐరాల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):ఐరాల మండలం అబ్బుగుండు గ్రామంలో బుధవారం చిరుత సంచరించినట్లు గ్రామస్తులు తెలిపారు. నాలుగు రోజుల క్రితం పుత్రమద్దిలో ఓ దూడను చిరుత చంపిన సంగతి తెలిసిందే. ఈ ప్రాంతానికి సమీపంలోని అబ్బుగుండులో చిరుత పాదముద్రలను గుర్తించిన యువకులు వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చారు.అటవీశాఖ అధికారులు గ్రామానికి చేరుకుని పాదముద్రలను పరిశీలించారు. డిప్యూటీ రేంజ్ అధికారి రాకేష్‌కుమార్ మాట్లాడుతూ ఎవ్వరు అటవీ ప్రాంతంలో పశువులను మేపడానికి వెళ్లవద్దన్నారు. రాత్రి సమయంలో చిత్తూరు నుంచి ఐరాలకు ద్విచక్ర వాహనంలో వచ్చేవారు అప్రమత్తంగా ఉండాలన్నారు. రామవనంనగరి, చెంగనపల్లె గ్రామస్తులు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కమ్మేసిన పొగమంచు

రామకుప్పం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం ప్రాంతంలో శనివారం తెల్లవారుజామున దట్టమైన పొగమంచు కురిసింది. ఉదయం 7.30 గంటల వరకూ మంచు ముసుగు తొలగకపోవడంతో వాహన చోదకులు లైట్ల వెలుతురులో రాకపోకలు సాగించారు. పొగమంచు కప్పేయడంతో చెరువులు, పొలాలు, వృక్షాలు, ఎకోటూరిజం పార్కు కొత్త అందాలను సంతరించుకుని ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకున్నాయి.



పేరుకే ప్రజా ఉద్యమం...

పాల్గొన్నదంతా వైసీపీ శ్రేణులే!

చిత్తూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నిర్మాణ దశలో ఉన్న వైద్య కళాశాలలను పీపీపీ పద్ధతిలో పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించడంపై వైసీపీ నిరసన కార్యక్రమా లను తీవ్రతరం చేసింది.ప్రజాఉద్యమం పేరిట బుధవారం నిరసనలకు పిలుపునిచ్చింది.ప్రజలంతా ఈ ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొనాలని ఊరూవాడా ప్రచారం చేసింది. అయితే బుధవారం నియోజకవర్గ కేంద్రాల్లో జరిగిన ఆందోళన కార్యక్రమాల్లో విద్యార్థులు కానీ, వారి తల్లిదండ్రులు కానీ , విద్యార్థి సంఘాల ప్రతినిధులు కానీ పాల్గొనలేదు. అన్ని చోట్లా పరిమిత సంఖ్యలో వైసీపీ నాయకులు, కార్యకర్తలే కనిపించారు. జీడీనెల్లూరులో నియోజకవర్గ ఇన్‌చార్జి కృపాలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో ఆ పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కరుణాకర రెడ్డి, మాజీ మంత్రి నారాయణస్వామి పాల్గొన్నారు. పుంగనూరులో జరిగిన ర్యాలీలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డితో పాటు జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.పూతలపట్టులో అంబేద్కర్ సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు మాజీ ఎమ్మెల్యేలు సునీల్‌కుమార్,లలితకుమారి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.చిత్తూరులో నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి విజయానందరెడ్డి ఆధ్వర్యంలో గంగినేని చెరువు పార్కు నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు జరిగిన ర్యాలీలో కరుణాకర రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పలమనేరులో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలో సెరికల్చర్ కార్యాలయం నుంచి ఆర్డీవో ఆఫీసు వరకు ర్యాలీ నిర్వహించారు.మాజీ మంత్రి రోజా ఆధ్వర్యంలో పుత్తూరులో జరిగిన నిరసన ర్యాలీలో కరుణాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పుంగనూరులో వైసీపీ శ్రేణుల ర్యాలీ



ఏక్తా దివస్ ర్యాలీలో ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్, మేయర్ తదితరులు

అపర చాణుక్యుడు వల్లభాయ్ పటేల్

చిత్తూరు అర్బన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యానంతరం వందలాది సంస్థానాలను భారతదేశంలో విలీనానికి ఒప్పించిన అపరచాణుక్యుడు వల్లభాయ్ పటేల్ అని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు పేర్కొన్నారు.చిత్తూరులో బుధవారం వల్లభాయ్ పటేల్ జయంతి జిల్లాస్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వందలాదిమంది విద్యార్థులు, అధికారులు, ఉద్యోగులు ఏక్త దివస్ ర్యాలీని నిర్వహించారు.గాంధీ విగ్రహం కూడలి నుంచి ఎంఎస్ఆర్ సర్కిల్ మీదుగా దర్గాసర్కిల్ గుండా తిరిగి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ సాగింది.ఎమ్మెల్యే జగన్మోహన్, కలెక్టర్ సుమిత్‌కుమార్, మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ హేమలత, మాజీ ఎమ్మెల్సీలు దొరబాబు, దుర్గారామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీబీసీకి ప్రత్యేకంగా అకౌంట్ ఆఫీసర్

● టీటీడీ ఈవో సింఘాల్

తిరుమల, నవంబరు12(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీబీసీ(శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్)లో ఆర్థిక అంశాలను ఎప్పటికప్పుడు అంచనా వేసేందుకు ప్రభుత్వం నుంచి లేదా, అటానమస్ సంస్థ నుంచి ప్రత్యేకంగా అకౌంట్స్ ఆఫీసర్‌ను నియమించాలని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో బుధవారం ఎస్వీబీసీ బోర్డు మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, ఎస్వీబీసీ ద్వారా మరింత నాణ్యమైన ప్రసారాలు అందించేందుకు చర్యలు చేపట్టినట్టు ఆయన తెలిపారు. ఈ సమీక్షలో ఎస్వీబీసీ ఇంచార్జీ సీఈవో ఫణికుమార్ నాయుడు, ఎఫ్ఏ అండ్ సీఏవో బాలాజీ పాల్గొన్నారు.

శంకర్‌రెడ్డికి గన్‌మెన్ కేటాయింపు

సత్యవేడు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డికి ప్రభుత్వం భద్రతను పెంచింది. శంకర్‌రెడ్డికి వన్ ప్లస్ వన్ గన్‌మన్‌ను కేటాయిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి నియోజకవర్గంలో చురుకుగా తిరుగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా నియోజకవర్గంలో పర్యటిస్తున్న శంకర్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని ఓ వర్గం గందరగోళ పరిస్థితులను సృష్టించే ప్రయత్నం చేస్తోందని ప్రభుత్వానికి సమాచారం అందడంతో భద్రత కారణాల దృష్ట్యా వన్ ప్లస్ వన్ గన్‌మన్ ఏర్పాటు చేసింది.

'కిష్కింధపురి' విజయంతో కొండకు వచ్చా!

● హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్



తిరుమల, నవంబరు12(ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన 'కిష్కింధపురి' సినిమా విజయవంతం అయిన సందర్భంగా శ్రీవేంకటేశ్వరస్వామికి, అభిమానులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ అన్నారు. తిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం ఆయన దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, తన తదుపరి చిత్రం 'హైందవ'ను కూడా ఇదే స్థాయిలో ఆదరించి విజయాన్ని ఇవ్వాలని కోరుకున్నానన్నారు.


సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 25 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.4.30 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 67,367

తలనీలాలు సమర్పించినవారు: 22,369



అటు కల్తీ నెయ్యి.. ఇటు పరకామణి

తిరుపతిలో ముమ్మరంగా టీటీడీ కేసుల విచారణ



సిట్ కార్యాలయం నుంచి బయటకు వస్తున్న ధర్మారెడ్డి

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): టీటీడీకి సంబంధించి కల్తీ నెయ్యి, పరకామణిలో చోరీ కేసులకు సంబంధించి తిరుపతిలో ముమ్మరంగా విచారణ జరుగుతోంది. ఒకవైపు సీఐడీ.. మరోవైపు సీబీఐ భాగస్వామ్యమున్న సిట్ ఆధ్వర్యంలో దర్యాప్తు జరుగుతోంది.

● తిరుపతిలోని టీటీడీ భూదేవి కాంప్లెక్సులో సీబీఐ డీఐజీ మురళీ రాంబా నేతృత్వంలోని సీబీఐ డీఎస్పీలు, సిట్ దర్యాప్తు అధికారి వెంకట్రావు ఇతర పోలీసు అధికారులు కల్తీ నెయ్యి కేసులో బోలేబాబా డెయిరీ డైరెక్టర్లు పొమిలిజైన్, విపిన్‌జైన్‌తో పాటు టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డిని మంగళ, బుధవారాల్లో విచారించారు. దీంతో ఇక్కడ కూడా హడావుడి నెలకొంది.

● మరోవైపు శ్రీ పద్మావతి అతిథి గృహం కేంద్రంగా వారం రోజులుగా పరకామణిలో జరిగిన చోరీ కేసును హైకోర్టు ఆదేశాల మేరకు ఏకంగా సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ నేతృత్వంలో అధికారులు విచారిస్తున్నారు. ఈ కేసులో నిందితుడు రవికుమార్, అతడి కుటుంబ సభ్యులను తొలుత విచారించారు. ఆ తర్వాత ఈ కేసు సమయంలో తిరుమలలో వన్‌టౌన్ సీఐగా పనిచేసిన జగన్మోహన్ రెడ్డి, ఎస్ఐ లక్ష్మీరెడ్డి, అప్పటి టూ టౌన్ సీఐ చంద్రశేఖర్, పరకామణి డిప్యూటీ ఈవో మల్లికార్జునరావు, టీటీడీ సెక్యూరిటీ అధికారులు సుబ్బరాజు, రామచంద్ర, సీసీ కమాండ్ యూనిట్ గార్డు చంద్రతో పాటు జయచంద్రారెడ్డిని విచారించి వాంగ్మూలం నమోదు చేశారు. దీంతో అధికారుల రాకపోకలు, విచారణ కోసం వస్తున్న వారితో పద్మావతి అతిథి గృహం సందడిగా మారింది.

● ఇంకోవైపు పరకామణి చోరీ కేసులో నిందితుడైన రవికుమార్.. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై ఏసీబీ విచారిస్తోంది. ఈ కేసు కూడా తిరుపతి కేంద్రంగా నడుస్తోంది. జరుగుతుంది.

◆ 'పరకామణి' కేసులో

టీడీపీ జోక్యం ఉండదు

● నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయండి ● సీఐడీ డీజీని కోరిన వర్ల రామయ్య



సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్‌తో మాట్లాడుతున్న వర్ల రామయ్య

తిరుపతి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పరకామణి చోరీ కేసుపై సీఐడీ జరుపుతున్న దర్యాప్తులో టీడీపీ జోక్యం ఉండదని, నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలంటూ ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్‌ను కోరారు. బుధవారం సాయంత్రం తిరుపతిలోని పద్మావతి అతిథి గృహం కాన్ఫరెన్సు హాలులో ఆయన టీడీపీ నేతలతోపాటు సీఐడీ చీఫ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. శ్రీవారి పరకామణిలో ఎన్ని వందల కోట్లు కొట్టేశారో తెలియాల్సి వుందన్నారు. ఈ కేసును నెలలోనే లోక్ అదాలత్‌లో రాజీ చేయడం వెనుక ఎవరున్నదీ ప్రజలకు తెలియాల్సి వుందన్నారు. హైకోర్టు ఇచ్చిన సమయం చాలకపోతే ఇంకా వ్యవధి తీసుకుని వాస్తవాలను వెలుగులోకి తేవాలని కోరారు. టీటీడీకి ఆస్తులను బదిలీ చేసిన సమయంలో స్టాంప్ డ్యూటీ ఎవరు చెల్లించారో తేల్చాలన్నారు. దీని వెనుక ఎంత పెద్దవారున్నా వదలిపెట్టవద్దని కోరారు. నిక్కచ్చిగా, నిర్భయంగా విచారణ చేయాలని అభ్యర్థించారు. పరకామణి చోరీ కేసు రాజీకి కర్త, కర్మ, క్రియ అంతా భూమన కరుణాకరరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, ధర్మారెడ్డి, ధనంజయరెడ్డిలేనని ఆరోపించారు. వారి కుటుంబీకులు, బంధువుల ఆస్తులు వెలికి తీయాలని, పరకామణి చోరీ నిధులతో ఆస్తులు ఎక్కడెక్కడ కొనుగోలు చేశారో నిగ్గు తేల్చాలని కోరారు. దర్యాప్తులో తేల్చాల్సిన పలు సందేహాలకు సంబంధించి 27 అంశాలతో వినతి పత్రం ఇచ్చారు. ఆయన వెంట ఆయన వెంట తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి, ఏపీ జీబీసీ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ, ఏపీ బయో డైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్, నాలెడ్జ్ సెంటర్ ఛైర్మన్ గురజాల మాల్యాద్రి, శాప్ ఛైర్మన్ రవినాయుడు, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నేతలు శ్రీధర్ వర్మ, కుమారమ్మ, మహేష్ యాదవ్, సూరా సుధాకరరెడ్డి, రజనీకాంత్ నాయుడు, పాతకం వెంకటేష్, వట్టికుంట శంకర్ తదితరులున్నారు.

హైకోర్టు ఆదేశాల మేరకు దర్యాప్తు

టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య నుంచీ వినతి పత్రాన్ని తీసుకున్న సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్.. ఆ పత్రాన్ని హైకోర్టుకు అందజేస్తామన్నారు. కోర్టు ఆదేశాల మేరకు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేస్తామన్నారు. లోతుగా విచారించి నిందితులకు శిక్ష పడేలా చూస్తామన్నారు. దేవుడి ఆస్తికి సంబంధించిన కేసు కాబట్టి నిర్భయంగా దర్యాప్తు చేస్తామని, దోషులు ఎంతటి వారైనా వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు.

పల్లికొండేశ్వరాలయ సర్వతోముఖాభివృద్ధే లక్ష్యం

● ఛైర్మన్ పద్మనాభరాజు



నూతన పాలకమండలి సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్

నాగలాపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పల్లికొండేశ్వర స్వామి దేవస్థానం సర్వతో ముఖాభివృద్ధి లక్ష్యంగా ముందుకెళ్తామని ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మన్ పద్మనాభరాజు చెప్పారు. బుధవారం ఆలయ సమావేశ మందిరంలో పాలక మండలి మొట్టమొదటి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొన్ని నిర్ణయాలు తీసుకున్నారు. దేవస్థానంలో ఉన్న గోశాలలో 56 గోవుల సంరక్షణకు ఇద్దరు కార్మికులు సరిపోకపోవడంతో మరో కార్మికుడిని నియమించుకోవాలని తీర్మానించారు. నిత్యం స్వామిఅమ్మవార్ల అభిషేకాలు ప్రారంభయ్యే సమయానికి గోపూజ నిర్వహించాలని, నైవేద్యం భక్తులందరికీ అందేలా దిట్టం పెంచాలని తీర్మానించారు. మరో ఇద్దరు అర్చకులను, అటెండరు నియామకానికి దేవదాయ శాక ఆమోదానికి పంపాలని ఈవో లతను కోరారు. కారిడార్ మరమ్మతులు పూర్తి చేసి భక్తుల బసకు ఏర్పాటు చేస్తామన్నారు. దాతల సహకారంతో మరో 8 వసతి గృహాలు నెల రోజుల్లో పూర్తి చేస్తున్నామన్నారు. 2026 ఫిబ్రవరిలో జరిగే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లపై ముందస్తు చర్చలు వేశారు. ఉభయదారులకు ఉభయపైకం రూ.35 వేల నుంచి రూ.50 వేలకు పెంచాలని తీర్మానించారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు కృష్ణయ్య, వెల్సన్ మండేలా హంస, దేవి, జయంతి, కవిత, నాగభూషణమ్మ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఇద్దరి మృతి



రంజిత్ నాయుడు, బాబురాజు

వడమాలపేట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తిరుపతి-చెన్నై జాతీయ రహదారి తడుకు ఆర్.ఎస్. వద్ద ఇద్దరు రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొని మృతి చెందారు. విజయపురం మండలం కేవీపురానికి చెందిన రంజిత్ నాయుడు(52), ఎస్‌బీఆర్‌పురానికి చెందిన బాబురాజు అలియాస్ నరసింహరాజు (51) రోడ్డు దాటుతుండగా తిరుపతి నుంచి పుత్తూరు వైపుగా వెళ్తున్న లారీ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వడమాలపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

విశాఖకు మరో రూ.10లక్షల కోట్ల పెట్టుబడులు

- బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు -

తిరుమల, నవంబరు12(ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో మరో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులతో 50 దేశాలకు చెందిన సంస్థలు విశాఖపట్నంలో కంపెనీలు పెట్టే అవకాశం ఉందని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు తెలిపారు. తిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం దర్శించుకున్న అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, ఇప్పటికే దాదాపు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల కోట్ల పెట్టుబడులతో అనేక సంస్థలు రాష్ట్రానికి వచ్చాయన్నారు. కాగా ఢిల్లీ బాంబ్ బ్లాస్ట్ నేరస్తులను శిక్షించే శక్తిని ప్రధాని మోదీ, అమిత్ షాలకు ప్రసాదించాలని శ్రీవారిని కోరుకున్నట్టు తెలిపారు. ఇలా ఉండగా వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కూడా బుధవారం స్వామిని దర్శించుకున్నవారిలో ఉన్నారు.

నేటి నుంచి 'నృత్య వాహిని'



వీసీ ఉమ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీలో గురువారం నుంచి 'నృత్య వాహిని' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వీసీ ఉమ తెలిపారు. బుధవారం ఆమె రిజిస్ట్రార్ రజని, కన్వీనర్లు వాణి, విజయలక్ష్మి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ హిమబిందుతో కలిసి మీడియాతో మాట్లాడారు. గురువారం ఉదయం 10 గంటలకు ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రారంభిస్తారన్నారు. మైసూరు వర్సిటీ ప్రొఫెసర్ శీల శ్రీధర్ కీలకోపన్యాసం చేస్తారన్నారు. 15వ తేదీ దాకా సాగే ఈ కార్యక్రమంలో 87 మంది దేశ, విదేశీ నృత్యకారులు అనేక నృత్య రీతులను ప్రదర్శిస్తారని చెప్పారు. వివిధ నృత్యాలపై మ్యూజిక్ అండ్ డ్యాన్స్ విభాగ అధ్యాపకురాలు డాక్టర్ హిమబిందు నేతృత్వంలో వర్క్‌షాప్ చేపడుతున్నామని తెలిపారు. సమాపనోత్సవం సందర్భంగా కళాకారులందరూ సామూహిక నృత్య ప్రదర్శన చేస్తారన్నారు.

పద్మావతి మహిళా పాలిటెక్నిక్‌లో ఫార్మసీ డిప్లొమా కోర్సుకు స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా పాలిటెక్నిక్‌లో ఫార్మసీ డిప్లొమా కోర్సులో ప్రవేశానికి 19వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఇందుకోసం 18వ తేదీ దాకా దరఖాస్తులు స్వీకరిస్తారు. ఇంటర్‌లో ఎంపీసీ లేదా బైపీసీ ఉత్తీర్ణత పొందిన విద్యార్థినులు విద్యార్హత సర్టిఫికెట్ల ఒరిజినల్, మూడు సెట్ల జిరాక్స్ కాపీలతో నేరుగా హాజరుకావాల్సి ఉంటుంది. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తారు. ప్రభుత్వం నిర్ణయించిన కోర్సు ఫీజుతో విద్యార్థినులకు ఉచిత హాస్టల్ వసతి కల్పిస్తారు. సమగ్ర సమాచారం కోసం.. 92990 08151 నెంబరులో సంప్రదించాలని ప్రిన్సిపాల్ పద్మావతి కోరారు.

ఆలయంలోకి సరుకులు చేర్చేందుకు కొత్త 'బ్యాగ్ కన్వేయర్'




ప్రస్తుతం వినియోగంలో ఉన్న బ్యాగ్ కన్వేయర్ - నూతన బ్యాగ్ కన్వేయర్

తిరుమల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలోకి ముడి సరుకులు చేర్చేందుకు నూతన బ్యాగ్ కన్వేయర్ (బ్యాగ్ స్టాగర్) అందుబాటులోకి వచ్చింది. సాధారణంగా శ్రీవారికి సమర్పించే అన్నప్రసాదాలు, లడ్డూలు, వడలు, ఇతర ప్రసాదాలన్నీ సంప్రదాయం మేరకు శ్రీవారి ఆలయంలోని పోటు (కట్టెల పొయ్యితో కూడిన వంటశాల)లోనే తయారవుతాయి. ఈమేరకు నిత్యం దాదాపు 50 టన్నుల నుంచి 65 టన్నుల ముడిసరుకులను ఆలయంలోకి పంపాల్సి ఉంటుంది. మహద్వారం నుంచి ఈ సరుకులను తరలించడం అంటే భక్తులకు ఇబ్బందులు ఎదురవుతాయి. ఈక్రమంలో 35 ఏళ్లుగా ఆలయం వెనుకభాగంలో ఉన్న ఉగ్రాణం (ముడిసరుకుల నిల్వ ప్రదేశం) నుంచి టీటీడీ బ్యాగ్ కన్వేయర్ ద్వారా సరుకులను ఆలయంలోకి పంపుతున్నారు. అప్పట్లో చెన్నైకి చెందిన ఓ సంస్థ ఈ బ్యాగ్ కన్వేయర్‌ను విరాళంగా అందించింది. ప్రసాదాల తయారీకి కావాల్సిన సరుకులను చిన్నపాటి మూటలు కట్టి ఈ కన్వేయర్‌పై ఉంచితే దాదాపు 40 అడుగుల ఎత్తులో ఉన్న ఆలయ ప్రాకారంపైకి చేరుతాయి. అక్కడి సిబ్బంది ఈ సరుకులను తీసుకుని ప్రసాదాల తయారీకి వినియోగిస్తారు. ఇది ప్రతిరోజు జరిగే ప్రక్రియ. అయితే దాదాపు 35 ఏళ్ల క్రితం నుంచి వినియోగిస్తున్న ఈ బ్యాగ్ కన్వేయర్ నిత్యం మరమ్మతులకు గురవుతోంది. అప్పటికప్పుడు మరమ్మతులు పూర్తిచేసి సిద్ధం చేసినప్పటికీ బ్యాగ్ కన్వేయర్ బాడీ పూర్తిగా దెబ్బతిన్నట్టు అధికారులు గుర్తించారు. కన్వేయర్ కింద నిత్యం భక్తులు కూడా రాకపోకలు సాగిస్తున్న క్రమంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకూడదనే ముందస్తు జాగ్రత్తగా టీటీడీ నూతన బ్యాగ్ కన్వేయర్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే ఓ దాత సహకారంతో నాగ్‌పూర్ నుంచి నూతన బ్యాగ్ కన్వేయర్‌ను తిరుమలకు తీసుకువచ్చారు. ప్రస్తుతం ఇందులోనే హైడ్రాలిక్, బాడీ వంటి వాటిని పరిశీలన చేస్తున్నారు. రానున్న రెండుమూడు రోజుల్లో దీన్ని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురానున్నారు.

'వికసిత్ భారత్' లక్ష్యంగా పనిచేయండి

● మహిళా మోర్చాను బలోపేతం చేయండి

● కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పిలుపు



తిరుపతి(ఉపాధ్యాయనగర్), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): 'వికసిత్ భారత్' లక్ష్యంగా పనిచేయాలని, మహిళా మోర్చాను బలోపేతం చేయాలని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జిల్లాకు చెందిన నిషిధారాజు బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలిగా నియమితులైన సందర్భంగా బుధవారం నిర్వహించిన ఆత్మీయ అభినందన సభలో ఆయన వీరు పాల్గొన్నారు. ఉత్పత్తి రంగాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరిచిన మేకిన్ ఇండియా నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేంద్ర మంత్రి సూచించారు. ఆత్మనిర్భర భారత్ లక్ష్యంగా పనిచేస్తే ప్రపంచంలో మూడవ ఆర్థిక శక్తిగా ఉన్న దేశాన్ని అగ్రస్థానంలోకి తీసుకెళ్లొచ్చని, దీనికి ప్రజలు, పార్టీ శ్రేణులు కంకణ బద్దులు కావాలని పిలుపునిచ్చారు. నిషిధారాజు ఆధ్వర్యంలో మహిళామోర్చా మరింత బలోపేతమౌతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలను పెద్ద సంఖ్యలో గెలిపించుకోవాల్సిన అవసరం కూటమిపై ఉందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో ముందుకు నడిపించేందుకు అహర్నిశలు కృషి చేస్తోందని ఎంపీ పాకా వెంకట సత్యనారాయణ, ఎమ్మెల్సీ సోమువీర్రాజు తెలిపారు. మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.నిషిధారాజును ఘనంగా సత్కరించి అభినందించారు. బీజేపీ నేతలు విష్ణుకుమార్ రెడ్డి, నాగోతు రమేష్ నాయుడు, సామంచి శ్రీనివాస్, నాగలక్ష్మి, మాధవి, పార్వతి, యువశ్రీ, విజయలక్ష్మి, ఇతర నేతలు, శ్రేణులు పాల్గొన్నారు.

చట్టాలను రూపకల్పన చేసిన దార్శనికుడు మోదీ

● లా విద్యార్థులతో కేంద్ర మంత్రి

కాలం చెల్లిన బ్రిటిష్ కాలం నాటి చట్టాలను మార్చి భారతీయ న్యాయ చట్టాలకు రూపకల్పన చేసిన దార్శనికుడు ప్రధాని నరేంద్రమోదీ అని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ పేర్కొన్నారు. అంబేడ్కర్ గ్లోబల్ లా కళాశాలలో బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన 'స్వశక్త భారత్ - ఆత్మనిర్భర్ భారత్' సదస్సులో ఆయన న్యాయ విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఐపీసీ, సీఆర్పీసీ, ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో భారతీయ న్యాయ చట్టాలను తీసుకురావడం సాధారణ విషయం కాదన్నారు. న్యాయ విద్యార్థులందరూ వీటిపై చైతన్యం తీసుకురావాలని సూచించారు. స్థానిక ఉత్పత్తులను మన జీవితంలో భాగం చేసుకుని దేశాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పీవీఎన్ మాధవ్ కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయ విద్యార్థులతో పాటు బీజేపీ నేతలు పాల్గొన్నారు. ఉదయం తిరుపతిలో 'మన ఊరు- మన జెండా' కార్యక్రమంలో భాగంగా తిరుపతి నగరం పళణి థీయేటర్ వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాధవ్ జెండా ఆవిష్కరించారు. పార్టీలో చేరిన యువకులకు కండువా కప్పారు.



డైకిన్ పరిశ్రమలో జాగృతి యాత్ర బృందం

శ్రీసిటీలో జాగృతి యాత్ర బృందం

శ్రీసిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జాగృతి యాత్ర బృందానికి చెందిన 525 మంది సభ్యులు గురువారం బుధవారం సాయంత్రం శ్రీసిటీని సందర్శించారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను తయారు చేసే లక్ష్యంతో ముంబైకి చెందిన జాగృతి సేవా సంస్థాన్ స్వచ్ఛంద సంస్థ ఏటా చేపట్టే ఈ జాగృతి యాత్ర, ప్రత్యేక రైలు ప్రయాణం ద్వారా దేశమంతా 8 వేల కి.మీ పర్యటిస్తుంది. వివిధ రంగాల్లో ఆదర్శవంతులను(రోల్ మోడల్) కలుసుకుని వారితో సంభాషించడం ద్వారా యాత్రికుల్లో స్ఫూర్తి నింపుతుంది. శ్రీసిటీ డైరెక్టర్(సీఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి యాత్ర బృందానికి సాదర స్వాగతం పలికి, పారిశ్రామిక కేంద్రం ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. పర్యటనలో భాగంగా యాత్రికులు శ్రీసిటీ పరిసరాలు, పారిశ్రామిక పురోగతిని నేరుగా వీక్షించడంతో పాటు పలు బ్యాచ్‌లుగా విడిపోయి డైకిన్, బ్లూస్టార్, లావాజ్జా ఈ ప్యాక్, పెప్సికో, అంబర్ రాక్‌వర్త్, బెర్గెన్ పైపు సపోర్ట్స్, ఏఎల్ఎఫ్, ఆర్ఎస్‌బీ ట్రాన్స్‌మిషన్, ఎంఎండీ, బ్రేక్స్ ఇండియా, డైకి అల్యూమినియం పరిశ్రమలను సందర్శించారు. శ్రీసిటీ ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, వ్యాపారానుకూల వాతావరణం, సుస్థిర పర్యావరణ వ్యవస్థ, ఉపాధి, వివిధ రకాల ఉత్పత్తుల వారిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. తమ బృందానికి సందర్శన అవకాశం కల్పించిన శ్రీసిటీ యాజమాన్యానికి జాగృతి సంస్థ సీఈవో అశుతోష్ కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పెట్టుబడులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అపార అవకాశాలు ఉన్న సంపూర్ణ వ్యాపార నగరానికి శ్రీసిటీ ఒక చక్కటి ఉదాహరణగా ఆయన పేర్కొన్నారు. 2016 నుంచి నేటి వరకు 8 పర్యాయాలు తమ బృందం శ్రీసిటీని సందర్శించిందని, ప్రతిసారి సభ్యులతో శ్రీసిటీ చెరగని ముద్ర వేసిందని వ్యాఖ్యానించారు. పరిశ్రమల సందర్శన అనంతరం బుధవారం రాత్రి వారి రోల్ మోడల్‌గా ఎంచుకున్న డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి జాగృతి సభ్యులతో సమావేశమవుతారు. ప్రపంచస్థాయి తయారీ కేంద్రంగా శ్రీసిటీ ప్రయాణం, దార్శనికత, సవాళ్లు, మైలు రాళ్లను వివరిస్తూ స్ఫూర్తిదాయక ప్రసంగం చేస్తారు.

నేటి నుంచి పంచగవ్య వైద్య మహా సమ్మేళనం



సమావేశంలో మాట్లాడుతున్న నిరంజన్‌వర్మ

తిరుపతి(ఎంఆర్ పల్లె), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో గురువారం నుంచి మూడు రోజుల పాటు పంచగవ్య వైద్య మహాసమ్మేళనం జరగనున్నట్లు సిద్ధాచార్య నిరంజన్‌వర్మ తెలిపారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ.. దేశ నలుమూలల నుంచి పంచగవ్య వైద్యశాస్త్రంపై పనిచేస్తునన శాస్త్రవేత్తలు, గవ్య ఉత్పత్తి నిర్వాహకులు, గోశాల నిర్వాహకులు, గోరక్షకులు సుమారు 1,200మంది ఈ సదస్సులో పాల్గొంటారని తెలిపారు. కొత్త కొత్త విషయాలపై తమ పరిశోధన పత్రాలను సమర్పిస్తారన్నారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందన్నారు. పంచగవ్య వైద్యశాస్త్ర విద్యను పూర్తిచేసిన 201మందికి అడ్వాన్స్ డిప్లొమా ఇన్ పంచగవ్య థెరపి సర్టిఫికెట్ అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ గురుస్వామి, ఝాన్సీ లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకుల ఖాతాల్లో నిస్తేజంగా రూ. 84.06 కోట్లు

- మనుగడలో లేని 4,30,939ఖాతాలు
- నామినీల కోసం వెతుకుతున్న సిబ్బంది

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా బ్యాంకుల్లో రూ.84.06 కోట్లు మురిగిపోతున్నాయి.బ్యాంకు ఖాతాలో నగదు వేసి లావాదేవీలు జరపకుండా వదిలేయడం.. ఖాతాదారులు మృతిచెందడం.. చిరునామా మార్చుకున్న వంటి కారణాలతో జిల్లాలోని 28 బ్యాంకుల పరిధిలో నిస్తేజంగా 4,30,939 బ్యాంకు ఖాతాలు ఉన్నట్లు రిజర్వు బ్యాంకు ప్రకటించింది.సదరు ఖాతాల్లో రూ. 84.06కోట్లు డిపాజిట్ల రూపంలో ఉన్నట్లు గుర్తించింది. పదేళ్లకు పైగా లావాదేవీల్లేని ఖాతాల్లో వున్న సొమ్మును తిరిగి ఇచ్చే ప్రక్రియను ఆర్‌బీఐ ప్రారంభించింది. కాబట్టి ఖాతాదారులు లేదా వారి నామినీలు సంబంధిత బ్యాంకుఖాతాను సంప్రదించి సరైన ధ్రువపత్రాలు సమర్పించి, ఈకేవైసీ పూర్తిచేయడం ద్వారా ఆ నగదు తిరిగి పొందవచ్చని లీడ్‌బ్యాంకు మేనేజరు తెలిపారు.

మీ సొమ్ము- మీ హక్కు

జిల్లాలోని అన్ని బ్యాంకుల్లో మీ సొమ్ము- మీ హక్కు పేరిట చైతన్యం కలిగించాలని రిజర్వు బ్యాంకు సూచించింది. ప్రతి బ్యాంకులో నిస్తేజంగా వున్న డిపాజిట్ ఖాతాలకు సంబంధించిన ఆధారాలు, డిపాజిట్‌దారుడి సమీప బంధువులు ఎవరున్నారనే కోణంలో పరిశీలించాలని సూచించింది. అక్టోబరులో ఈ ప్రక్రియను ప్రారంభించి డిసెంబరులోగా పూర్తి చేయాలని ఆదేశించింది.

క్లియరెన్స్ మేళా...

ఖాతాదారులు లేని పక్షంలో చట్టబద్ధంగా వారసురాలైన వారు కేవైసీ రికార్డులను బ్యాంకుకు అందిస్తే అన్‌క్లెయిమ్‌డ్‌గా ఉన్న నిధులను వారి అనుబంధ ఖాతాల వివరాలను క్రోడీకరించుకుని నిబంధనల ప్రకారం సొమ్మును వెనక్కు ఇవ్వాలని బ్యాంకులు నిర్ణయించాయి. ఇటీవల బ్యాంకుల్లో ఇదో ప్రధానమైన అంశంగా మారిపోయింది. ప్రతి బ్యాంకులోనూ ఇలాంటి ఖాతాలను క్లియర్ చేయాలని భావిస్తున్న బ్యాంకర్లు అందుకు అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లో పేర్ల ప్రకారం పట్టణ, నగరాల్లో వారు నివసించిన ప్రాంతాల్లో ఆరా తీస్తున్నారు. ప్రచారాలతోనే సరిపెట్టకుండా స్థానికంగా ఉండే ఉద్యోగుల ద్వారా ప్రచారం చేస్తున్నారు. కొన్నేళ్లుగా రికార్డులకే పరిమితంగా కొనసాగుతున్న ఖాతాల నుంచి వారసులకు అనుకోకుండా సొమ్ము చేరుతుంది. కనీసం తమ కుటుంబ సభ్యులకు బ్యాంకు ఖాతాలున్నాయనే వివరాలు తెలియని వారికి వేల నుంచి లక్షలాది రూపాయలు అందబోతోంది. వెబ్‌సైట్‌ల ద్వారా కూడా అన్‌క్లెయిమ్‌డ్ బ్యాంకు ఖాతాల వివరాలను ఆరా తీసే వెసులుబాటు ఉంది. వీటికోసం అన్ని బ్యాంకుల్లో వంద రోజులుగా మేళాను నిర్వహిస్తున్నారు.

వివరాలు ఇలా

జిల్లాలో గుర్తింపు పొందిన 28 బ్యాంకుల ద్వారా 275 శాఖలు ఉన్నాయి. దాదాపు అన్నింటిలోనూ క్లెయిమ్ చేయని మొత్తాలున్నట్లు తెలుస్తోంది. ఇందులో సేవింగ్స్ ఖాతాలకు సంబంధించి 4, 12, 342 ఖాతాల్లో రూ.50.89 కోట్లు, సంస్థాగత రకంలో 14,660 ఖాతాల్లో రూ. 26.63 కోట్లు, ప్రభుత్వ రంగ డిపాజిట్ల రూపంలో 3937 ఖాతాల్లో రూ. 6.55 కోట్లు ఉన్నాయి. ఆధార్, పాన్ కార్డులు అందించి బ్యాంకులకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా లీడ్ బ్యాంక్ అధికారి హరీష్ తెలిపారు.అసలు ఖాతాదారు మరణిస్తే నామినీకి అందజేస్తారన్నారు. అత్యధికంగా ఇండియన్ బ్యాంకులోని 103375 ఖాతాల్లో రూ. 35.69కోట్లు, ఎస్‌బీఐలోని 75040 ఖాతాల్లో రూ.19.51కోట్లు,యూనియన్ బ్యాంకులోని 69335ఖాతాల్లో రూ. 10.14 కోట్లు, బ్యాంక్ ఆఫ్ ఇండియాలోని 26887 ఖాతాల్లో రూ.3.20 కోట్లు, కెనరా బ్యాంకులోని 24,931 ఖాతాల్లో రూ.3.92కోట్లు, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులోని 29087 ఖాతాల్లో రూ.2.41కోట్లు, డీసీసీబీలోని 49 ఖాతాల్లో రూ.15 లక్షలు ఉన్నట్లు రిజర్వు బ్యాంకు ప్రకటించింది.



చిత్తూరులోని ఇండియన్ బ్యాంకు మెయిన్ బ్రాంచిలో ఏర్పాటు చేసిన మేళాకు సంబంధించిన బ్యానర్

ముగిసిన ఫైరింగ్ శిక్షణ


ఫైరింగ్ ప్రాక్టీస్, సిబ్బందితో మాట్లాడుతున్న అడిషినల్ ఎస్పీ రాజశేఖర్‌రాజు

గంగాధరనెల్లూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణలో సివిల్ పోలీసులు ప్రధానపాత్ర వహిస్తున్నారని అడిషినల్ ఎస్పీ ఆపరేషన్స్ అండ్ ఇంచార్జ్ అడ్మిన్ రాజశేఖర్‌రాజు అన్నారు. గంగాధరనెల్లూరు సమీపంలో ఫైరింగ్‌రేంజ్ వద్ద ఈనెల 6 నుంచి సివిల్ పోలీస్ అధికారులు, సిబ్బంది చేస్తున్న ఫైరింగ్ ప్రాక్టీస్ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా రాజశేఖర్ రాజు మాట్లాడుతూ ఫైరింగ్ ప్రాక్టీస్‌లో మెలకువలు నేర్చుకున్నపుడే క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించేటప్పుడు ఉపయోకరంగా ఉంటుందన్నారు.అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని జిల్లా పోలీస్‌శాఖ ఉన్నతికి ముందడుగు వేయాలని సూచించారు. అనంతరం అందరితో కలిసి అడిషినల్ ఎస్పీ ఫైరింగ్ ప్రాక్టీస్ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ మహబూబ్‌బాష, ఆర్ఐ అడ్మిన్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి ఆలయానికి టెండర్ల ఆదాయం రూ.1.06 కోట్లు


టెండర్లు నిర్వహిస్తున్న అధికారులు

ఐరాల(కాణిపాకం), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుని ఆలయానికి ఆన్‌లైన్ టెండర్లు, సీల్డ్ టెంటర్లు, బహిరంగ వేలాల ద్వారా రూ.1,06,99,997 ఆదాయం బుధవారం లభించింది. ఆలయ కార్యాలయ భవన ఆవరణలో టెండర్లను నిర్వహించారు. దుకాణాల సముదాయంలో హోటల్ నిర్వహించే హక్కును హెచ్చుపాటదారుడు రూ.54,63,000 కైవసం చేసుకున్నాడు. భక్తుల పాదరక్షల భద్రపరచుకునే హక్కు కోసం హెచ్చుపాటదారుడు రూ.24,56,997 దక్కించుకున్నారు. వినాయక సదన్ వద్ద హోటల్ నిర్వహణ కోసం టెండరు దారుడు రూ.27,10,000 చేజిక్కించుకున్నాడు. మరగదాంబిక కల్యాణ మండపం వవద్ద దుకాణం నిర్వహణను రూ.70వేలతో దక్కించుకున్నాడు. కార్యక్రమంలో ఆలయ ఈవో పెంచలకిషోర్, డీఈవో సాగర్‌బాబు, ఏఈవో ధనంజయ, సూపరింటెండెంట్ బాలరంగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

15నుంచి శబరిమల యాత్రకు ఆర్టీసీ సర్వీసులు


నాగరాజుకు శ్రీవారి ప్రసాదాన్ని అందజేస్తున్న రాము

చిత్తూరు రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): శబరిమల అయ్యప్పస్వామి దేవాలయం తెరుచుకోనున్న నేపథ్యంలో ఈనెల 15 నుంచి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను నడపనుంది. ఈక్రమంలో కేరళ రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ నాగరాజును చిత్తూరు డీపీటీవో రాము బుధవారం కేరళలో కలిశారు. ఆయనకు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆర్టీసీకి పన్నులు మినహాయింపు ఇచ్చేందుకు ఆయన అంగీకరించినట్లు డీపీటీవో తెలిపారు. ఇప్పటివరకు జిల్లా నుంచి 23 బస్సులు బుక్ అయినట్లు పేర్కొన్నారు.

ముగిసిన వరసిద్ధుడి పవిత్రోత్సవాలు


మహా పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేదపండితులు

ఐరాల(కాణిపాకం), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో బుధవారం మహా పూర్ణాహుతిని వైభవంగా నిర్వహించడంతో పవిత్రోత్సవాలు ముగిశాయి. ఉదయం ఈవో పెంచలకిషోర్ సిబ్బందితో కలిసి పవిత్రోత్సవాల పూజా సామగ్రిని పండితులకు అందించారు. అలంకార మండపం వద్ద ఉన్న కల్యాణ వేదికపై పండితులు అవబృథ యాగం, స్థండిల మండలేశ్వర పూజ, హోమ వ్రత సమర్పణ, మహా పవిత్ర సమర్పణ, విశేష ద్రవ్యాహుతి, మహాపూర్ణాహుతి, మహా దీపారాధన, యాత్రా దానం, స్వామికి మహాస్నపనం, కుంభ చండీయాగం, దీపారాధనను నిర్వహించారు. డీఈవో సాగర్‌బాబు, ప్రధాన అర్చకులు సోమశేఖర్‌గురుకుల్, ఏఈవోలు రవీంద్రబాబు, ధనుంజయ,సూపరింటెండెంట్లు వాసు,కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి హుండీ ఆదాయం రూ.2.20కోట్లు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

శ్రీకాళహస్తి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయం రూ. 2,20,13,724 వచ్చింది. ఆలయంలోని కొట్టు మండపం వద్ద లెక్కింపు చేపట్టారు. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీలను లెక్కించారు. బంగారం 59.100 గ్రాములు, వెండి 599 కిలోలు, విదేశీ కరెన్సీ 132 వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లకు ప్రభుత్వ ప్రాధాన్యం

- ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు అర్బన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధాన మంత్రి అవాజ్ యోజన కింద పేదల గృహ నిర్మాణానికి ఆర్థికసాయం అందిస్తున్నాయని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు చెప్పారు. బుధవారం నగరపాలక పరిధిలోని తిమ్మసముద్రంలో గృహ ప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గ్రామాల్లో అనుభవంలో ఉన్న స్థలాలకు పత్రాలను ఇస్తే ఇంటి నిర్మాణానికి దరఖాస్తులు చేసుకుంటారన్నారు. ఇంటి స్థలం లేని వారికి గ్రామకంఠం, పరంబోకు స్థలాల్లో స్థలాలను కేటాయించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం గృహ నిర్మాణానికి ఈ నెలాఖరులోపు అవకాశం కల్పించిందన్నారు, ప్రాధాన్యత క్రమంలో లబ్ధిదారులను గుర్తించి ఇండ్లను మంజూరు చేయాలన్నారు. , ఇండ్లులేని వారే ఉండకూడదనేది కూటమి ప్రభుత్వ సంకల్పమన్నారు.కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో పీఎంఏవై 1.0కింద ఇప్పటి వరకు పూర్తయిన 10, 168 గృహాలకు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా గృహ ప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు.ఇంకా ఇండ్లులేని వారిని గుర్తించి 2,472 గృహాల మంజూరు ఉత్తర్వులు అందజేస్తున్నామన్నారు. గ్రామకంఠం, ప్రభుత్వ పరంబోకు స్థలంలో అనుభవ పత్రాల మంజూరుకు వీఆర్వోలు చర్యలు చేపట్టాలన్నారు. ఇళ్ల మంజూరు కోసం గ్రామ సచివాలయాల్లోని ఇంజనీరింగ్ అసిస్టెంట్ల ద్వారా ఈ నెలాఖరులోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పీఎంఏవై కింద డబ్బుతో ఇసుక, సిమెంటు, కమ్మీలు వంటి సమకూర్చుకోగలరని, నిర్మాణాలకు బీసీ, ఎస్సీలకు రూ. 50వేలు, ఎస్టీలకు రూ. 75వేలు అధనంగా ఆర్థికసాయం చేస్తున్నామన్నారు. డ్వాక్రా సంఘాల ద్వారా అదనంగా రుణసౌకర్యం కల్పిస్తామన్నారు. అంతకుముందు ఎంపీ ఇంటి గృహప్రవేశాన్ని రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. కార్యమంలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు, హౌసింగ్ పీడీ సుబ్రహ్మణ్యం, ఈఈ శంకరప్ప, కమిషనర్ నరసింహ ప్రసాద్, ఏఈ శ్రీధర్, టీడీపీ నగర అధ్యక్షులు నరేష్, టీడీపీ నేతలు ఈశ్వర్, నవీన్‌కుమార్, కోదండయాదవ్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.


ఇంటి తాళాన్ని లబ్ధిదారురాలికి ఇస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

17నుంచి కుష్ఠు వ్యాధిపై సర్వే


పోస్టర్లను ఆశాలకు, వాలంటీర్లకు అందజేస్తున్న డాక్టర్ వెంకట ప్రసాద్

చిత్తూరు రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఈ నెల 17 నుంచి కుష్టు వ్యాధి సర్వేను సమర్థంగా నిర్వహించాలని జిల్లా టీబీ, కుష్ఠు నివారణ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ సూచించారు. బుధవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో పారామెడికల్ సిబ్బందికి ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30 వరకు సర్వే జరుగుతుందన్నారు. ఈ సర్వేలో ఆశాలు, మేల్ వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి చర్మం మీద స్పర్శ లేని మచ్చలు ఉన్నట్లయితే గుర్తించాలన్నారు. వారిని పీహెచ్‌సీ వైద్యాధికారికి వద్దకు తీసుకెళ్లి పరీక్షించాలన్నారు. సర్వేకు సహకరించాలని, కుష్టు వ్యాధిని జిల్లా నుంచి తరలికొట్టేందుకు తోడ్పడాలని పిలుపునిచ్చారు. స్పర్శలేని మచ్చలు, కుష్టు వ్యాధికి సంబధించిన మచ్చల గుర్తింపుపై శిక్షణ ఇచ్చారు. అనంతరం లెప్రసీ ఇండియ స్టేట్ రిసోర్స్ పర్సన్ శాంతి ప్రియదర్శిని పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో కుష్టు వార్డు వైద్యాధికారి జానకిరావు, ఫిజియో తెరపిస్ట్ జాన్, వైద్యాధికారులు షర్మిల పాల్గొన్నారు.

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్టు


నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ

కల్లూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి బీసీ కాలనీలో సోమవారం జరిగిన మహిళ హత్య కేసులో నిందితుడిని మంగళవారం సాయంత్రం అరెస్ట్ చేసి బుధవారం రిమాండు నిమిత్తం పాకాల కోర్టుకు తరలించినట్లు కల్లూరు సీఐ జయరామయ్య, ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. సీఐ కథనం మేరకు.. ఎల్లంకివారిపల్లి బీసీ కాలనీలో కాపురముంటున్న వృద్ధురాలు కళావతమ్మ ఇంట్లోకి సోమవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తి చొరబడి మెడలోని బంగారు గొలుసు లాగుతుండగా మిద్దెపై కాపురం ఉంటున్న విమల (59) కిందకు వస్తూ దుండగుడి దురాగతాన్ని గమనించింది. వృద్ధురాలితో ఘర్షణ పడుతూ ఆమెను కత్తితో తీవ్రంగా గాయపరుస్తుండగా విమల అడ్డుకుంది. ఈక్రమంలో నిందితుడు అదే కత్తితో విమలను పొడిచి పరారు కాగా ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. గాయపడిన వృద్ధురాలు కళావతమ్మ ఇచ్చిన వివరాలు, డాగ్‌స్క్వాడ్ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇదే పంచాయతీ గోపన్నగారిపల్లికి చెందిన మోహన్ (28) హత్య చేసినట్లు నిర్ధారించుకున్న పోలీసులు మంగళవారం సాయంత్రం పులిచెర్ల రైల్వేస్టేషన్ వద్ద నిందితుడిని అరెస్టు చేశారు. ఈ మేరకు బుధవారం నిందితుడు మోహన్‌ను రిమాండ్ నిమిత్తం పాకాల కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

బాలిరెడ్డిగారిపల్లిలో ఏనుగుల బీభత్సం

- వరి, మామిడి, కొబ్బరి, అరటి, వక్క చెట్లు ధ్వంసం


ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరిపంట, వక్క చెట్లను ధ్వంసం చేసిన ఏనుగులు

కల్లూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పొలాలపై ఏనుగుల గుంపు బీభత్సం సృష్టిస్తున్నాయి. మండలంలోని కమ్మపల్లి పంచాయతీలో మంగళవారం రాత్రి ఏనుగుల గుంపు దాడి చేయడంతో వరి, కొబ్బరి, మామిడి, అరటి, వక్క చెట్లకు అపారనష్టం జరిగింది. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని బోడబండ నుంచి బయలుదేరిన 16 ఏనుగుల గుంపు బాలిరెడ్డిగారిపల్లి వద్దకు చేరుకున్నాయి. ముందుగా దేశిరెడ్డిగారిపల్లిలోని రవీంద్రారెడ్డి, కేశవులరెడ్డిలకు చెందిన మామిడిచెట్ల కొమ్మలను విరిచేసిన ఏనుగుల గుంపు డ్రిప్ పైపులను తొక్కేశాయి. అక్కడి నుంచి బాలిరెడ్డిగారిపల్లి , జాండ్రపేట, దేశిరెడ్డిగారిపల్లెల్లోని రైతులకు చెందిన వరి, కొబ్బరి, మామిడి, అరటి, వక్క చెట్లను ధ్వంసం చేశాయి. అనంతరం అడవిలోకి తిరుగుముఖం పట్టాయి. బుధవారం పగలంతా అడవిలోని బోడబండ వద్ద ఏనుగుల గుంపు సంచరించినట్లు ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫీ, ఎఫ్‌బీవోలు మధు, కృష్ణమూర్తి తెలిపారు.

బీజేపీలో చేరిన వైసీపీ నేత


తిరుపతిలో బుధవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, మహిళ మోర్చా అధ్యక్షురాలు నిషిధరాజుతో శివప్రకాష్ రాజు

వెదురుకుప్పం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గంగాధర నెల్లూరు నియోజకవర్గ పరిధిలోని పాలసముద్రం వైసీపీ కోట బీటలు వారింది. ఎంపీపీ శ్యామల భర్త శివప్రకాష్ రాజు బుధవారం తిరుపతిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, మహిళ మోర్చా అధ్యక్షురాలు నిషిధ రాజు సమక్షంలో బీజేపీ కండువా వేసుకున్నారు. మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, జీడీ నెల్లూరు వైసీపీ సమన్వయకర్త కృపాలక్ష్మికి వ్యతిరేక వర్గంగా ఏర్పడిన వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శివప్రకాష్ రాజుతో పాటు వెదురుకుప్పానికి చెందిన వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పేట ధనంజయులురెడ్డిని పార్టీ నుంచి బహిష్కరించారన్న విషయం తెలిసిందే. వీరి సస్పెన్షన్ ఎత్తివేతకు కొంతమంది ప్రయత్నిస్తున్న నేపథ్యంలో శివప్రకాష్ రాజు బీజేపీలో చేరడం చర్చనీయాంశంగా మారింది. అలాగే నల్లవెంగనపల్లె ఎంపీటీసీ సుజాత భర్త అయిన ధనంజయులురెడ్డి వైసీపీ ఆవిర్భావం నుంచి రెండేళ్ల క్రితం వరకు మండల పార్టీ అధ్యక్షుడిగా పని చేశారు. తన భర్తను బహిష్కరించిన నేపథ్యంలో ఎంపీటీసీ పదవికి రాజీనామా చేస్తానని సుజాత ప్రకటించిన విషయం తెలిసిందే.

ఎస్వీయూ మెన్ క్రికెట్ టోర్నీ ప్రారంభం


తారకరామ స్టేడియంలో జరుగుతున్న క్రికెట్ మ్యాచ్

తిరుపతి(క్రీడలు), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక తారకరామ మైదానంలో ఎస్వీయూ మెన్ క్రికెట్ 2025-26 టోర్నమెంట్ బుధవారం ఉదయం ప్రారంభమైంది. ఎస్వీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎం.శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో 30 కాలేజీల జట్లు తలపడుతున్నాయి. ఈ పోటీలు వారం రోజుల పాటు కొనసాగనున్నాయి.

తొలి రోజు జరిగిన మ్యాచ్‌ల వివరాలిలా...

- చిత్తూరు వీసీఆర్ డిగ్రీ కాలేజీపై తిరుపతి ఎమరాల్డ్ డిగ్రీ కాలేజీ విజయం
- కుప్పం డిగ్రీ కాలేజీపై పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ గెలుపు
- కార్వేటనగరం డిగ్రీ కాలేజీపై చిత్తూరు విజయం డిగ్రీ కాలేజీ గెలుపు
- గేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్టడీస్‌పై శ్రీకాళహస్తి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విజయం
- తిరుపతి గేట్ డిగ్రీ కాలేజీపై తిరుపతి బీఎస్‌ఆర్ డిగ్రీ కాలేజీ గెలుపు
- పాకాల ప్రభుత్వ డిగ్రీ కాలేజీపై తిరుపతి ఫస్ట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ ఇన్ ఎడ్యుకేషన్ విజయం

ముక్కంటికి బహుమానంగా పలు గ్రామాలు

- శ్రీకాళహస్తిలో బయటపడ్డ అరుదైన విజయనగర కాలంనాటి రాగిపలకల శాసనాలు

శ్రీకాళహస్తి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): విజయనగరరాజు శ్రీరంగరాయ శ్రీకాళహస్తీశ్వరాలయంలో కైంకర్యాలు, అన్నదానాలు నిర్వహించడం కోసం నాడు కాడు, కంపిలి, అందలమాల, ఉప్పటేరు, దుగ్గరాజపట్టణం, పిలిగుంచలపోతు, చీమలపాడు, తిరుమూరు గ్రామాలను బహుమానంగా ఆలయానికి ఇస్తున్నట్లు లిఖించిన శాసనాలు బయటపడ్డాయి. ఆలయంలో అనువంశిక గురుకుల్‌గా సేవలందిస్తున్న డాక్టర్ పరశురామ్ ఇంట అవి పదిలంగా తరాలుగా ఉన్నాయి. శక. 1498, ధాత్రి, కార్తీక సు. 12న అనగా 1576 నవంబరు 3 శనివారం రోజున ఈగ్రామాలను దానంగా ఇచ్చినట్లు ఇందులో ఉంది. చంద్రగిరి రాజ్యంలోని పడనాడు సీమకు చెందిన బ్రాహ్మణుడు యాదాటి నరసింహభూపాల మనుమడు, తిమ్మావధాని కుమారుడు అయిన శ్రీలక్ష్మీపతి భట్టుకు వీటిని దానంగా ఇచ్చినట్లు లిఖించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో నైవేద్య కైంకర్యాలకు, పునరుద్ధరణ పనులకు వినియోగించాలని పేర్కొన్నారు. తిరుమూరుకు వెంగలాంబపురం అని పేరు మార్చిన అంశం కూడా ఇందులో ఉంది.

వెలుగులోకి వచ్చింది ఇలా...

శ్రీకాళహస్తీశ్వరాలయ రాజగోపురానికి ఆనుకుని ఉన్న తేరువీధిలో అనువంశిక దండాధికారి డాక్టర్ పరశురామ్ గురుకుల్ నివాసం ఉంది. వీరి వంశీయులు తరతరాలుగా పరంపరాగతంగా ఆలయంలో వైదిక కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. తాత పేరుతోనే నామకరణం జరుపుకున్న పరశురామ్ గురుకుల్ చెన్నైలో ఎంబీబీఎస్ పూర్తి చేసి కొంతకాలం స్విమ్స్‌లో డాక్టర్‌గా చేశారు. చదువుతోపాటు వేదం, ఆగమ, శిల్పశాస్త్రాలను అధ్యయనం చేశారు. వైద్యవృత్తికన్నా అనువంశికంగా చేస్తున్న వైదిక కత్రువుల నిర్వహణనే ఎంచుకున్న ఆయన ప్రస్తుతం ఆలయంలో దండాధికారిగా ఉన్నారు. తీరిక వేళల్లో ఇంటి వద్ద వైద్యసేవలు కొనసాగిస్తున్నారు. తమ ఇంట మంత్రబంధనంగా ఉన్న పురాతన రాగిఫలకలను అపడుడపుడు తెరచేవారు. ఇటీవల కార్తీక మాసం కావడంతో వీటిని శుద్ధి చేశారు. డాక్టర్‌పరశురామ్ గురుకులు కుటుంబానికి పురోహితులుగా వ్యవహరిస్తున్న సింగరాజు మణి ఆ రాగిఫలకల మీద ఉన్న అక్షరాలను చూసి ఆసక్తితో వాటిని ఫోటోలు తీసి ఎపిగ్రఫీ డైరెక్టర్ మునిరత్నంరెడ్డికి పంపడంతో ఇవి విలువైన చారిత్రక ఆధారాలనే సంగతి వెల్లడైంది. రెండు జతల శాసనాలు వీరి వద్ద ఉన్నాయి. ఇవి రాజముద్రతో కూర్చి ఉన్నాయి. రెండింటిలో కలిపి మొత్తం ఐదు రాగిపలకలు ఒక గుత్తిగా ఉన్నాయి.. ఇందులో ఒక దానిపై శ్రీరామ శాసనం... మరొకదానిపై విరూపాక్ష శాసనం అని ఉంది.


పరశురామ్ గురుకుల్


రాగిరేకులమీద ఉన్న శాసనాలు - విజయనగర రాజ్య చిహ్నం వరాహం చిత్రంగల రాజముద్ర

ఎట్టకేలకు దళవాయి చెరువులో రాకపోకలు



దళవాయి చెరువులో రాకపోకలకు సిద్ధం చేసిన రోడ్డు పనులు

సోమల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం నంజంపేట- పొదలకుంటపల్లె మార్గంలోని దళవాయి చెరువు వద్ద ప్రయాణికుల రాకపోకలు జరుగుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దళవాయి చెరువు వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక కల్వర్టు కొట్టుకుపోయింది. గత నెలరోజులుగా ఈ మార్గంలో రాకపోకలు స్తంభించిపోయాయి. గత ఏడాది చెరువు కట్ట తూము వద్ద గండి పడి కట్ట కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి, అప్పట్లో చెరువులోనే రాకపోకలకు అనువుగా తాత్కాలిక కల్వర్టు ఏర్పాటు చేయడం జరిగింది. ఇటీవల వర్షాలకు ఆ కల్వర్టు కొట్టుకుపోయింది. ఈక్రమంలో పొదలకుంటపల్లె, వడ్డిపల్లె, తుగడంవారిపల్లె, సూరయ్యగారిపల్లె నుంచి నంజంపేట, పెద్ద ఉప్పరపల్లెకు వచ్చే విద్యార్థులు, వారపు సంతలకు వచ్చే రైతులు, ప్రజలు రాలేకపోయారు. దీంతో సోమల జనసేన మండల అధ్యక్షుడు నాగభూషణం రాయల్, ఏఎంసీ డైరెక్టర్ మురళీ జనసైనికులు రాకపోకలకు అనువుగా ఎక్స్‌కవేటర్లు ఏర్పాటు చేసి గత రెండు రోజులుగా పనులను ముమ్మరం చేసి రాకపోకలకు సిద్ధం చేశారు. ప్రయాణికులు జనసైనికులను అభినందించారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ తగదు



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి తదితరులు

పుంగనూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ విరమించుకోవాలని పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి డిమాండు చేశారు. బుధవారం స్థానిక ప్రైవేటు బస్టాండ్‌లోని వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ రాముకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, చిత్తూరు మాజీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప, రాష్ట్ర వైసీపీ కార్యదర్శి ఎన్.అనీషారెడ్డి, ఎన్.శ్రీనాథరెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీంబాషా, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, నాయకులు నాగభూషణం, పోకల అశోక్‌కుమార్, కౌన్సిలర్లు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● **కుప్పం:** మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు రాష్ట్ర ప్రభుత్వ చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని ఎమ్మెల్సీ భరత్ వైసీపీ నేతలతో కలిసి బుధవారం కుప్పం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట నేతలు విజలాపురంబాబు, కోదండరెడ్డి, మురుగేష్, దండపాణి తదితరులున్నారు.

మూతపడిన శుద్ధినీటి కేంద్రాలు



సోమలలో మూతపడిన వాటర్ ప్లాంటు

సోమల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సోమల పట్టణంలోని స్వయంభేశ్వర స్వామి ఆలయం, పోలీస్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్లు గత 20 రోజులుగా మూతపడ్డాయి. వాటికి మరమ్మతులు చేయకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటు చేసిన మినరల్ ప్లాంట్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న మినరల్ వాటర్ ప్లాంటు వద్ద ఉదయం 8 గంటల లోపు తాగునీటిని తెచ్చుకుంటున్నారు. అనంతరం ఆ గదికి తాళం వేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇరికిపెంట పంచాయతీలోని వడ్డిపల్లె, దిడ్డివారిపల్లె, చెన్నయ్యగారిపల్లె, సోమల పట్టణ వాసులకు శుద్ధి నీరు అందడం లేదు. అధికారులు స్పందించి మినరల్ వాటర్ పథకాలకు మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వైసీపీ కల్తీగాళ్ల వెన్నులో వణుకు: గౌనివారి

రామకుప్పం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సిట్ దూకుడుతో టీడీపీ లడ్డూప్రసాదం అపవిత్రం చేసిన వైసీపీ కల్తీగాళ్ల వెన్నులో వణుకు పుడుతోందని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌనివారి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడటంతో కోట్లాది మంది వేంకటేశ్వరస్వామి భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు. సుప్రీంకోర్టు నియమించిన సిట్ దర్యాప్తులో వైసీపీ కల్తీగాళ్లు బయటపడుతున్నారన్నారు. వైసీపీ హయాంలో లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడారన్న విషయం బట్టబయలైనప్పటికీ జగన్‌కు చెందిన పేపర్, టీవీలు అబద్ధాలను వండి వార్చి ప్రజల్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. 2022లో వైవీసుబ్బారెడ్డి చైర్మన్‌గా ఉన్నపుడు నెయ్యిలో పామాయిల్ కలిపినట్టు నివేదిక వచ్చినా ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆయన ప్రశ్నించారు. సుబ్బారెడ్డికి కమీషన్లు ముట్టింది కాబట్టే కల్తీ నెయ్యి అని తెలిసీ కాంట్రాక్టర్లు కొనసాగించాయన్నారు. కల్తీ నెయ్యి కేసులో సుబ్బారెడ్డి పాత్ర లేకపోతే సిట్ ఆయన బ్యాంకు ఖాతాలు, లావాదేవీలు అడిగితే ఎందుకు కోర్టుకు వెళ్లారని ఆయన ప్రశ్నించారు. వైసీపీ పెద్దలకు లబ్ధి చేకూర్చేందుకే నిబంధనలను మార్చి అడ్డగోలు టెండర్లతో నాణ్యతకు తిలోదకాలిచ్చారని తెలిపారు.

మాల మహానాడు సభను విజయవంతం చేయాలి



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

కల్లూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మదనపల్లిలో ఈనెల 16న నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి మాల మహానాడు మహాసభను విజయవంతం చేయాలని మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దరణికుమార్, మాజీ ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాసులు తెలిపారు. పులిచెర్ల మండలం దిగువపోకలవారిపల్లి పంచాయతీ అశోక్‌నగర్ కాలనీలో బుధవారం మాల మహానాడు మహాసభ గోడపత్రికలను ఆవిష్కరించారు. మాల మహానాడు నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. నాయకులు భానుప్రకాష్, నడిపన్న, భాస్కర్, శిద్దరామయ్య, సాయికిరణ్, శారద, రోజ, కమల, శ్యామల పాల్గొన్నారు.

విద్యార్థులు సన్మార్గంలో పయనించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వెంకటేశులు

పలమనేరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సన్మార్గంలో పయనించాలని పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.ఎం.వెంకటేశులు సూచించారు. బుధవారం కళాశాలలో ఆరోగ్యవంతమైన సంబంధం, స్వాభిమానం అనే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి వారిని గౌరవించడం నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.నందీశ్వరయ్య, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ బెనర్జీ, ఉమన్‌సెల్ కో ఆర్డినేటర్ డాక్టర్ శశికళ, డాక్టర్ రుక్మిణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

నేటి నుంచి బురుజుపల్లెలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు

సోమల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం నెల్లిమంద పంచాయతీ బురుజుపల్లెలో కొలువుదీరిన శ్రీవారి ఆలయంలో గురువారం గణపతిపూజ, విష్వక్సేనపూజ, రక్షాబంధనం, కలశారాధన, హోమాధికార్యక్రమాలు, 14న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి నవమి వార్షిక కల్యాణోత్సవం,రాత్రి ఉత్సవమూర్తుల గ్రామోత్సవం, టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులచే సంకీర్తలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో విజయకుమారి

సోమల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నిర్దేశించిన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం విద్యార్థులకు వడ్డించాలని ఎంఈవో విజయకుమారి భోజన నిర్వాహకులకు సూచించారు. బుధవారం అన్నెమ్మగారిపల్లె, టీఎం.గొల్లపల్లె, పొలికిమాకులపల్లె తదితర పాఠశాలలను ఆమె సందర్శించారు. విద్యార్థుల విద్యాప్రమాణాలను పరిశీలించారు. హెచ్‌ఎం. జీసీకే.ప్రసాద్, రమేశ్, అశోక్, సీఆర్పీ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన చల్లా రామచంద్రారెడ్డి



పుంగనూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా చిన్నమండ్యంలో గృహ ప్రవేశాల కార్యక్రమానికి వచ్చిన సీఎం చంద్రబాబునాయుడును పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుంగనూరు నియోజకవర్గంలోని పలు సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

ఆదర్శ పాఠశాలలో తనిఖీలు



పాఠశాలలో తనిఖీలు చేస్తున్న అధికారులు

రొంపిచెర్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల ఆదర్శ పాఠశాలలో బుధవారం విద్య , నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకంపై ఆడిట్ అధికారులు తనిఖీలు చేశారు. రికార్డులు పరిశీలించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని సొసైటీ ఫర్ సోషల్ ఆడిట్ డీఆర్పీలు బి.రవి తెలిపారు. ఎంఈవో శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ రెడ్డిప్రదీప్, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి లక్ష్యంతో ముందుకెళ్లాలి



మాట్లాడుతున్న పలమనేరు డీఎస్పీ డేగల ప్రభాకర్

గంగవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి లక్ష్యంతో ముందుకెళ్లాలని పలమనేరు డీఎస్పీ డేగల ప్రభాకర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక మదర్‌థెరీసా కళాశాలలో జరిగిన ఫ్రెషర్స్ డే కు డీఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డిగ్రీ అంటేనే విద్యార్థి భవిష్యత్తులో స్థిరపడటానికి ఉపయోగపడేది అన్నారు. తరగతి గదిలో అధ్యాపకులు బోధించే పాఠ్యాంశాలను విద్యార్థులు శ్రద్ధతో విని మంచి మార్కుల సాధనకు కృషి చేయాలని సూచించారు. ఉన్నత స్థాయిలో స్థిరపడి మనం పది మందికి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదిగేలా కష్టపడి చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు, చైర్మన్ సునీల్, అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్ రెడ్డి, పలువురు అధ్యాపకులు, ఎంబీఏ, ఎంసీఏ, ఎంటెక్, బీటెక్ విద్యార్థులు పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన తప్పనిసరి

పలమనేరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు ఎస్టీ కాలనీలో బుధవారం జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ ఆకస్మికంగా తనిఖీలు చేపట్టి మలేరియా, డెంగీ , మలేరియా, బోధకాలు, మెదడువాపులపై అవగాహన కల్పించారు. ఇంటింటికి వెళ్లి లార్వాలను పరిశీలించారు. జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్, సబ్‌యూనిట్ అధికారి కేసీ జయశంకర్, హెల్తు అసిస్టెంట్లు బలరాం, యర్రపరెడ్డి, కుమారి, సులోమి, వసంతమ్మ, పాల్గొన్నారు.

శోభాయమానంగా కార్తీక దీపోత్సవం



రామకుప్పం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవాలు శోభాయమానంగా సాగుతున్నాయి, బుధవారం పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంతో బాటూ ఆవరణలోని వేంకటేశ్వరస్వామి, వినాయకస్వామి, ఆంజనేయస్వామి, పద్మావతి, శనీశ్వరాలయాల్లో దీపాలను వెలిగించారు.

ప్రతి కుటుంబానికీ సొంతిల్లే లక్ష్యం

● ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



రామకుప్పం: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

రామకుప్పం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి కుటుంబానికి సొంత ఇంటిని కల్పించడమే సీఎం చంద్రబాబు నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. రాష్ట్రంలో పేదల సొంతింటి కలను నెరవేర్చే విధంగా సీఎం చంద్రబాబు వర్చువల్ విధానంలో సామూహిక గృహప్రవేశాలను ప్రారంభించిన సందర్భంగా ఆయన రామకుప్పం మండలం కెంచనబల్లలో ఏపీఎస్‌ఆర్టీసీ వైస్‌చైర్మన్ మునిరత్నం, ఏఎంసీ చైర్మన్ జీఎంరాజులతో కలిసి నూతనగృహ ప్రవేశాలు చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పీఎం ఆవాజ్ యోజన కింద రాష్ట్రంలో 3 లక్షలకు పైగా సామూహిక గృహప్రవేశాలను సీఎం చంద్రబాబు వర్చువల్‌గా ప్రారంభించడం గర్వకారణమన్నారు. కుప్పం నియోజకవర్గంలో కూడా నూతనగృహాలను ప్రారంభించడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ రాము, తహసీల్దారు కౌలేష్, ఎంపీడీవో లక్ష్మీకాంత్, గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టర్ మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరమణ, నరసింహులు, మాజీ అధ్యక్షులు ఆనందరెడ్డి, ఆంజనేయరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణ, వైస్‌ఎంపీపీ వెంకట్రామగౌడు, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్, రెస్కో వైస్‌చైర్మన్ విశ్వనాథ్, సింగిల్‌విండో చైర్మన్ మహ్మద్‌రఫీ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులంటే గౌరవం లేదా..?

● ఐసీడీఎస్ తీరుపై కలెక్టర్ దృష్టికి తీసుకెళతాం
● పంటలను ధ్వంసం చేస్తున్న ఏనుగుల కట్టడిలో అధికారులు విఫలం



సీడీపీవోను నిలదీస్తున్న ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి

కల్లూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేపట్టే కార్యక్రమాలకు స్థానిక ప్రజా ప్రతినిధులను పిలవకపోవడం సరికాదని, ప్రజా ప్రతినిధులంటే గౌరవం లేదా... లెక్కలేనితనమా అంటూ ఐసీడీఎస్ సీడీపీవో వాణిశ్రీదేవిని ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి నిలదీశారు. పులిచెర్ల మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఐసీడీఎస్ అధికారుల తీరుపై గత మండల సమావేశంలోనే ప్రశ్నించామని.. అయినా వారి తీరులో ఎలాంటి మార్పు లేదన్నారు. ప్రజాప్రతినిధులపై వారు వ్యవహరిస్తున్న తీరుపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతామన్నారు. పులిచెర్ల ప్రభుత్వాస్పత్రిలో అసంపూర్తిగా ఉన్న భవనాల పనులను త్వరతగతిన చేపట్టాలన్నారు. విద్యుత్ స్తంభాలను రహదారులకు సమీపాల్లో ఏర్పాటు చేస్తుండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. మూడేళ్లుగా మండలంలో పంటలను ధ్వంసం చేస్తున్న ఏనుగుల కట్టడిలో సంబంధిత అధికారులు విఫలమయ్యారని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చేపట్టే కార్యక్రమాలకు సూపర్‌వైజర్లతో స్థానిక ప్రజా ప్రతినిధులను ఆహ్వానిస్తామని సీడీపీవో వాణి శ్రీదేవి మండల మీట్ దృష్టికి తీసుకొచ్చారు. పేదలందరికీ ప్రభుత్వ వైద్యం అందుబాటులో ఉందని వైద్యాధికారి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో సన్నబియ్యంతో నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని ఎంఈవో పోకల తాతయ్య తెలిపారు. ఎంపీడీవో రాజశేఖర్‌బాబు, తహసీల్దార్ జయసింహ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధశాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు



బహుళ అంతస్తుల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

పలమనేరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొంటామని పలమనేరు మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమించి నిర్మాణాలు చేస్తే తొలగింపు చర్యలు చేపడుతామని హెచ్చరించారు. గడ్డూరురోడ్డు, బొమ్మిదొడ్డి తదితర ప్రాంతాల్లో జరుగుతున్న అనధికార కట్టడాలను పట్టణ ప్రణాళిక సిబ్బందితో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ ఏడాది జూన్ 30 వరకు రిజిస్ట్రేషన్ కాబడిన అనధికార లే అవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలని.. ఇందుకు నవంబరు 23 వరకు మాత్రమే ప్రభుత్వం గడువు ఇచ్చిందన్నారు. కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు స్వామిత్వ గ్రామసభ

సదుం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న సదుం మండలం గొంగివారిపల్లె, 19న పాలమంద పంచాయతీల్లో స్వామిత్వ గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాధారాణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామసభల్లో గ్రామకంఠం భూముల గుర్తింపు, భూసర్వేలపై అభ్యంతరాలు, సవరణలు తదితర రెవెన్యూ సమస్యల పరిష్కార చర్యలు, గ్రామసభల్లో పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు, గ్రామస్తులు పాల్గొని కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

వైసీపీ నిరసన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో బుధవారం ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ వైసీపీ చేపట్టిన ప్రజా ఉద్యమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ గా వెళ్లి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



కళాశాలలో మాట్లాడుతున్న సీఐ మురళీమోహన్

లమనేరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం విద్యార్థినులకు పోక్సో చట్టం, బాల్యవివాహాలు, సైబర్ నేరాలపై పలమనేరు సీఐ మురళీమోహన్, ఎస్ఐ స్వర్ణతేజ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బాల్యవివాహాలతో కలిగే అనర్థాలు, బాల్యవివాహాలు చేస్తే ఎదుర్కోవాల్సిన చట్టపరమైన సమస్యలను, శిక్షలను వారికి వివరించారు.

ప్రజారోగ్య పరిరక్షణకు సంజీవని ప్రాజెక్టు



నక్కబాలేపల్లెలో రక్తపరీక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న రవిరెడ్డి

రామకుప్పం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం సంజీవని ప్రాజెక్టు తీసుకొచ్చిందని టీడీపీ రామకుప్పం-1 క్లస్టర్ ఇన్‌చార్జి రవిరెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధి నక్కబాలేపల్లెలో ఉచిత రక్తపరీక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతిఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించాలన్నదే ధ్యేయంగా 46 తరక్త పరీక్షలతో వారికి అవసరమైన వైద్యసేవలందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. నేతలు రమేష్‌రెడ్డి, మురళీమోహన్, వెంకటాచలం, నరసింహులు, రామకుప్పం ప్రభుత్వాస్పత్రి సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తపరీక్ష ఫలితాల పత్రాలు అందజేత



రక్తపరీక్ష ఫలితాల పత్రాలను పంపిణీ చేస్తున్న సలాం

రామకుప్పం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం బందార్లపల్లె పంచాయతీ గెర్నిపల్లె గ్రామంలో ప్రజలకు రక్తపరీక్ష ఫలితాల పత్రాలను టీడీపీ మైనారిటీసెల్ మండల ఉపాధ్యక్షుడు సలాం అందజేశారు. రక్త పరీక్ష ఫలితాల పత్రాలను రామకుప్పం ప్రభుత్వాస్పత్రి వైద్యులకు చూపించి తగు చికిత్సలు, ఆరోగ్య సలహాలు పొందాలని కోరారు. కార్యక్రమంలో నేతలు సుధాకర్‌రెడ్డి, బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గృహనిర్మాణాలు ప్రారంభం



నూతన గృహాలను ప్రారంభిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్లలో నిర్మించిన ఇళ్లను పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు కె.ఉమేరా, అనిల్‌అహమ్మద్ దంపతులకు పూలమాల వేసి నూతన దుస్తులు అందించి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా చల్లా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం 17 నెలల కాలంలో నూతన గృహప్రవేశాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ కిరణ్‌కుమార్, హౌసింగ్ డీఈ మోగానంద నాయుడు, టీడీపీ మండలాధ్యక్షుడు రమణ, సర్పంచ్ ఆర్.ఇబ్రహీంఖాన్, సింగిల్‌విండో అధ్యక్షుడు రఘునాథరెడ్డి, మాజీ సర్పంచ్ రవికుమార్‌నాయుడు, నియోజకవర్గ తెలుగు యూత్ ఉపాధ్యక్షుడు నాగరాజ, మాజీ టీడీపీ మండల కన్వీనర్ ఓబులేశ్వర్‌రెడ్డి, చెంగల్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, రామ్మూర్తి, అమరనాథరెడ్డి, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డులో మౌలిక వసతుల కల్పనకు కృషి



మార్కెట్‌యార్డును పరిశీస్తున్న కడప జేడీ సుధాకర్

పుంగనూరు రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో మౌలిక వసతులు కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కడప మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్ పి. సుధాకర్ తెలిపారు. బుధవారం సాయంత్రం పుంగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన యార్డును పరిశీలించి పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రైతులు, కూలీలకు తాగునీరు, మరుగుదొడ్ల వసతులు కల్పించాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట మార్కెట్‌కమిటీ చైర్మన్ శమిపతి, కార్యదర్శి గోపి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

17న పుంగనూరులో కార్తీక లక్ష దీపోత్సవం

పుంగనూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు కోనేరులో ఈనెల 17న సోమవారం సాయంత్రం కార్తీక లక్షదీపోత్సవం వైభవంగా జరుగుతుందని హిందూజాగరణ సమితీ సభ్యులు తెలిపారు. బుధవారం కోనేరులో బురద, మెట్లు, చెత్త శుభ్రం చేశారు. స్థానిక ఫైర్‌సిబ్బంది సహకారంతో ఫైర్ ఇంజన్ ద్వారా శుభ్రత పనులు చేయగా మరోవైపు కోనేటిలోని నీటిని మోటార్ల ద్వారా బయటకు పంపారు. కొత్త నీటిని నింపి ఈనెల 14వ తేది మధ్యాహ్నం మహాశివుడికి రుద్రహోమం, కోనేరు సంప్రోక్షణ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించడం జరుగుతుందన్నారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

శ్వాసకోశ వ్యాధులపై అవగాహన ర్యాలీ



వెదురుకుప్పం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి):పిల్లలకు వచ్చే వ్యాధులపై తల్లులకు అవగాహన ఉండాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ హనుమంతరావు అన్నారు. బుధవారం పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల లోపు పిల్లలకు వచ్చే శ్వాసకోశ వ్యాధులు(నెమ్ము)తదితర వాటిపై అవగాహన అవసరమన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు ఈ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని తల్లులకు కల్పిస్తామన్నారు. తరువాత అవగాహన ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో సర్వలైన్స్ అధికారి డాక్టర్ అనిల్‌కుమార్, పీహెచ్‌సీ డాక్టర్లు కె.చెంగారెడ్డి, బీవై కృష్ణచైతన్య, సీహెచ్‌వో కొప్పేటి మధుసూదన్ పాల్గొన్నారు.

మామిడి రైతులకు న్యాయం చేయాలి

చిత్తూరు సెంట్రల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మామిడి రైతులకు ఫ్యాక్టరీల నుంచి న్యాయం జరిగేలా చూడాలని మామిడి రైతుల సంక్షేమ సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. మామిడి కిలో రూ.8 చెల్లించే అంశంపై బుధవారం సంఘం నేతలు సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేలు చొరవ చూపి గుజ్జు ఫ్యాక్టరీలు మామిడి రైతులకు రూ.8 చెల్లించేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిబాబు, ఆనందనాయుడు పాల్గొన్నారు.

కేజీబీవీ స్పెషల్ మెటీరియల్ ఆవిష్కరణ



స్పెషల్ మెటిరియల్ ఆవిష్కరించిన ఏపీసీ

చిత్తూరు సెంట్రల్, నవంబరు 12(ఆంధ్ర జ్యోతి): కేజీబీవీల్లో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థినులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణ ఆకాంక్షించారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా రూపొందించిన స్పెషల్ మెటిరియల్‌ను బుధవారం ఆయన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీసీ మాట్లాడుతూ జిల్లాలోని కేజీబీవీల్లో ఫస్టియర్ విద్యార్థినులు మెటిరియల్ సాయంతో వంద శాతం ఉత్తీర్ణత సాధించవచ్చునన్నారు. ఈ మేరకు జీసీడీవో ఇంద్రాణిని ఆదేశించారు. ఏఎంవో సుభాషిణి, కేజీబీవీల అధ్యాపకులు ఉన్నారు.

జిల్లా స్థాయి సైన్స్ క్విజ్ పోటీలకు ఎంపిక



అక్షయ

శ్రీరంగరాజపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గంగమ్మగుడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిది తరగతి చదువుతున్న విద్యార్థి ఎం. అక్షయ ఇటీవల జరిగిన కౌశల్ సైన్స్ అన్లైన్ క్విజ్ పోటీలో జిల్లా స్థాయికి ఎంపికైంది. స్కూలు హెచ్ఎం కళావతి ఈ విషయం తెలిపారు. బుధవారం పాఠశాల ఉపాధ్యాయులు,సహచర విద్యార్థులు ఆమెను అభినందించారు.

ఎంఎస్ఎంఈ డైరెక్టర్‌కు సన్మానం



చినబాబును సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

విజయపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎంఎస్ఎంఈ డైరెక్టర్, చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిది నల్లపనేని మురళీమోహన్(చినబాబు)ను తిరుపతి ఆయన స్వగృహంలో బుధవారం టీడీపీ నాయకులు శాలువాతో సన్మానించారు. ఆయన టీడీపీకి చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ బీసీ అధికార ప్రతినిది చుక్కా ధనుంజయయాదవ్, చిత్తూరు పార్లమెంటు టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, నాయకులు పాల్గొన్నారు.

పీఎంఏజీవై పనుల పరిశీలన



తయ్యూరు వద్ద పనులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు

శ్రీరంగరాజపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పీఎంఏజీవై పథకం కింద తయ్యూరు, వెంకటాపురం గ్రామ పంచాయతీలలో చేపడుతున్న పనులను జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు బుధవారం పరిశీలించారు. ఐవీఆర్ఎస్ కింద ఎంపికైన ఎస్ఆర్‌పురం గ్రామ పంచాయతీ యూఎంపురంలో చెత్త సేకరణ పనులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంపీడీవో వనజ, ఏఈ ఆర్డబ్ల్యూస్ ఏఈ పీఆర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి



సీనియర్ నాయకులకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): క్షేత్ర స్థాయిలో టీడీపీని బలోపేతం చేస్తూ ప్రజల్లోకి వెళ్లాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కోరారు. టీడీపీ కార్యాలయం వద్ద బుధవారం జరిగిన గ్రామ, వార్డు టీడీపీ కమిటీ సభ్యులతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రాన్ని పారిశ్రామికరంగా అభివృద్ధి చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేషలు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. వారి ఆశయాలకు అనుగుణంగా పార్టీ శ్రేణులు పని చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజిమాధవయ్య, వన్నెకుల క్షత్రియ డైరెక్టర్ షణ్ముగరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షులు గుణశేఖర్, జీవరత్నంనాయుడు, మండల అధ్యక్షుడు జవహర్‌రెడ్డి, రమేష్‌రాజు, ఆరవ బాలాజీ, వెంకటేశ్వరరావు, బాలాజీ, ధనంజయనాయుడు, సురేష్ నాయుడు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల అకడమిక్ కౌన్సిల్ భేటీ



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

నగరి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్వయం ప్రతిపత్తి పొందిన నేపథ్యంలో బుధవారం నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల రెండవ అకడమిక్ కౌన్సిల్ సమావేశం ప్రిన్సిపాల్ వేణుగోపాల్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో గత ఏడాది సాధించిన విజయాలను, ప్రమాణాలను, అకడమిక్, పరిశోధనలను వివరించారు. వాణిజ్య శాస్త్రం ప్రొఫెసర్, కామర్స్, మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరులు, రెసిడెన్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మంజుల, భాస్కర్‌రాజు, సభ్యులు రవివర్మ, రాజేంద్రప్రసాద్, గుణశేఖర్ ,కళాశాల ఐక్యూ కో-ఆర్డినేటర్ ఇందిరా ప్రియదర్శిని, వేణుగోపాల్, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సదరం స్లాట్ల బుకింగ్

బంగారుపాళ్యం,నవంబర్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈ నెల 14 నుంచి వైకల్య నిర్ధారణ కోసం సదరం స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చని ఎంపీడీవో మహేష్ బుధవారం తెలిపారు. స్లాట్ బుకింగ్స్ కోసం సమీపంలోని గ్రామ,వార్డు సచివాలయాలు లేదా సేవా కేంద్రాల్లో రూ.40 ం చెల్లించి బుకింగ్స్ చేసుకోవాలన్నారు. తప్పని సరిగా ఆధార్,రేషన్‌కార్డును వెంట తీసుకెళ్లాలన్నారు.

నేడు 'విజయం'లో మెగా జాబ్‌మేళా

చిత్తూరు సెంట్రల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) స్థానిక సుందరరాజుపురంలోని విజయం ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో గురువారం ఉదయం మెగా జాబ్‌మేళ నిర్వహిస్తున్నట్లు విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత విద్యా సంవత్సరంలో డిగ్రీ, ఎంబీఏ, ఎంసీఏ పూర్తి చేసుకున్న విద్యార్థులతో పాటు మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా ఇందులో పాల్గొనవచ్చునన్నారు. 24/7, క్యాడ్ మ్యాక్స్, ఇండో మైమ్ లాంటి సంస్థలు సంయుక్త సహకారంతో నిర్వహించే జాబ్‌మేళాలో మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు.

మాధవ్‌ను కలిసి రావూరి



పీవీఎన్ మాధవ్‌ను సన్మానించిన రావూరి వెంకటస్వామి

చిత్తూరు సెంట్రల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తిరుపతి పర్యటనకు వచ్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ను చిత్తూరు ఆర్‌వీఎస్ విద్యాసంస్థల అధినేత రావూరి వెంకటస్వామి బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి, సన్మానించారు.. జిల్లాలో బీజేపీ అభ్యున్నతికి కృషి చేయాలని మాధవ్ సూచించినట్లు. రావూరి వెంకటస్వామి చెప్పారు. ఆయనతో పాటు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, శ్రీనివాస్, చిట్టిబాబు, గాలిపుష్పలత ఉన్నారు.

వైభవంగా కాలభైరవాష్టమి పూజలు

నగరి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని కాలభైరవ స్వామి ఆలయంలో అష్టమి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి పాలు, పెరుగు పంచామృతం చందనం, పన్నీరు మొదలగు సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

దివ్యాంగుల నుంచి ట్రైసైకిళ్లకు దరఖాస్తుల ఆహ్వానం

నగరి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు నియోజకవర్గానికి 10 చొప్పున ట్రై సైకిళ్లు(మోటారు) మంజూరు చేయనున్నట్లు నియోజకవర్గ దివ్యాంగ జేఏసీ అధ్యక్షుడు కేశవన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూఏపీడీఏఎస్‌సీఏపీ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఈ నెల 25 లోపు దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఈ ఏడాది నవంబరు 25 నాటికి 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు, సదరం ధ్రువీకరణ పత్రం ప్రకారం కాళ్లలో 70 శాతం కంటే ఎక్కువ వికలత్వం ఉండాలన్నారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షల కంటే తక్కువ ఉన్నవారు అర్హులన్నారు.

వరసిద్ధుని సేవలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే

ఐరాల(కాణిపాకం), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ కుటుంబ సమేతంగా బుధవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదమంత్రాలతో పండితులు ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలను అందించారు. ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు పాల్గొన్నారు.

ఆలయానికి 35 బారికేడ్ల వితరణ



బారికెడ్లను వితరణ చేస్తున్న నాగార్జున సిమెంట్ అధికారులు

ఐరాల(కాణిపాకం), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి నాగార్జున సిమెంట్ తిరుపతి మేనేజర్ నందన్ 35 బ్యారికేడ్లను వితరణ చేశారు. ఈ బ్యారికేడ్ల విలువ రూ.2,50,000 ఉంటుందని ఈఈ వెంకటనారాయణ తెలిపారు. దాతకు అధికారులు ఆలయ మర్యాదలతో స్వామి దర్శనం కల్పించారు.

అర్జీలు సకాలంలో పరిష్కరించాలి:ఆర్డీవో



రెవెన్యూ సిబ్బందికి సూచనలిస్తున్న శ్రీనివాసులు

యాదమరి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ ద్వారా అందిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని ఆర్డీవో శ్రీనివాసులు రెవెన్యూ సిబ్బంది ఆదేశించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిర్యాదుల విషయంలో నిర్లక్ష్యం చేయకుండా పరిశీలించాలన్నారు. రీ సర్వే వివరాలపై తహశీల్దార్ పార్థసారధిని అడిగి తెలుసుకున్నారు. పాచిగుంట చౌకదుకాణంలో తనిఖీ నిర్వహించారు. డీటీ జయంతి, ఆర్ఐ ప్రసాద్, సర్వేయర్ తులసీధర్ పాల్గొన్నారు.

అప్పుల బాధతో ఎలక్ట్రీషియన్ ఆత్మహత్య

యాదమరి, నవంబరు 12 : అప్పుల బాధతో వ్యక్తి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. చిన్నంపల్లికి చెందిన గోవిందరాజు (62) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ మండల కేంద్రంలో హార్డ్‌వేర్ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. వ్యాపారం కోసం అప్పులు చేశాడు. నష్టాలు రావడంతో అప్పులు తీర్చేమార్గం లేదని మనస్థాపంతో రెండురోజులక్రితం పురుగుల మందు తాగాడు. చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుని భార్య డిల్లీ పిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధిహామీ పనులపై సమీక్ష

పాలసముద్రం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో నాణ్యత పెంచాలని ఎంపీడీవో షతీష్ పేర్కొన్నారు. బుధవారం ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం 450 మంది కూలీలు రోజు పనులు చేస్తున్నారన్నారు. ప్రతి పంచాయతీలో వంద మంది కంటే తక్కువగా వస్తే పీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెట్లపై చర్యలు తీసుకోవలసి ఉంటుందని హెచ్చరించారు.

ఇరుకు రహదారులతో ఇక్కట్లు



పచ్చికాపల్లం నుంచి వెదురుకుప్పానికి ఈ సింగిల్ రోడ్డే గతి



ప్రమాదాలకు నిలయంగా కార్వేటినగరం సమీపంలోని చిన్నకనుమ మలుపు



దేవరగుడిపల్లె సమీపంలో ప్రమాదకర మలుపు

వెదురుకుప్పం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు విస్తరణ పనులు జరగక మలుపులలో ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు విస్తరణ పనులపై ఆశలు పెంచుకున్న కార్వేటినగరం, వెదురుకుప్పం మండలాల ప్రజలకు నిరాశే మిగిలుతోంది. వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం నుంచి కార్వేటినగరానికి, పచ్చికాపల్లం నుంచి వెదురుకుప్పం, దేవళంపేట మీదుగా ఎస్ఆర్‌పురం మండలం 49 కొత్తపల్లిమిట్ట వరకు రోడ్డు విస్తరణ పనులు జరగాల్సి ఉంది. తిరుపతి, చిత్తూరు, పుత్తూరు పట్టణాలకు వెళ్లడానికి పచ్చికాపల్లం కూడలి ప్రాంతం. పచ్చికాపల్లం నుంచి కార్వేటినగరానికి సుమారు 11 కి.మీ దూరం ఉంది.

సింగిల్ రోడ్డు కావడంతో ఈ మార్గంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. కార్వేటినగరం సమీపంలో చిన్నకనుమ మలుపు వద్ద తరచుగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. పచ్చికాపల్లం నుంచి వెదురుకుప్పం మీదుగా 49 కొత్తపల్లిమిట్టకు సుమారు 24 కి.మీ దూరం ఉంది. ఇది కూడా సింగిల్ రోడ్డు కావడంతో పాటు అధిక సంఖ్యలో మలుపులు ఉండటంతో ప్రమాదాలు జరగడం పరిపాటిగా మారిపోయిందని స్థానికులు తెలిపారు.

ఇకనైనా రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని కార్వేటినగరం, వెదురుకుప్పం మండలాల ప్రజలు కోరుతున్నారు.

పేదల ఇంటి కల సాకారం ప్రభుత్వ లక్ష్యం





ఇళ్ల లబ్దిదారులకు తాళాలు అందజేస్తున్న ఎమ్మెల్యేలు భానుప్రకాష్ -మురళీమోహన్

నగరి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నిరుపేదల సొంతింటి కల నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. నగరిలో బుధవారం చింతలపట్టెడలో పేదల పక్కాగృహ ప్రవేశాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు పట్టా భూమిని కల్పించి నిరుపేదలకు పక్కా గృహాల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుడుతోందని ఆయన తెలిపారు. భాస్కర్, కమిషనర్ కృష్ణారెడ్డి, గుణశేఖర్, మధువాసం, శ్రీనివాసన్,పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. **పూతలపట్టు:** మన్నారుపల్లెలో పీఎంఏవై 1.0 పథకం కింద నిర్మించిన గృహాలను ఎమ్మెల్యే మురళిమోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఐటీ మంత్రి లోకేష్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి వైపు నడిపిస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యేను స్థానిక నేతలు, కార్యకర్తలు గజమాలతో సన్మానించారు. దొరబాబు చౌదరి, బాబురావు, నేతాజి, మురళి నాయుడు, ఆదికేశవులు నాయుడు, మునస్వామి గుంటూరు మురళి, ప్రవీణ్, చంద్రమౌళి పాల్గొన్నారు. **గంగాధరనెల్లూరు:** బోడపూరులో పీఎంఏవై పథకంలో భాగంగా లబ్ధిదారు బేబిరాణి గృహప్రవేశం కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమష్టిగా ప్రగతికి కృషి చేస్తున్నాయన్నారు. హౌసింగ్ అధికారులు, టీడీపీ నాయకులు మోహన్‌నాయుడు, శ్రీధర్ యాదవ్, దేవసుందరం, బాబునాయుడు, జ్యోతియాదవ్,అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి సాయం



చెక్కును అందిస్తున్న హరిబాబునాయుడు

ఐరాల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కామినాయనపల్లెకు చెందిన టీడీపీ కార్యకర్త రాజేంద్రనాయుడు కటుంబ సభ్యులకు బుధవారం మండల పార్టీ అధ్యక్షుడు గంగారపుహరిబాబునాయుడు రూ.5 లక్షల చెక్కును అందించారు. పుల్లూరు పంచాయతీ మట్టపల్లె ఎస్సీ కాలనీలో అగ్నిబాధితులకు రూ.10 వేలను అదించారు నాగమవాండ్లపల్లెలో ఏనుగు దాడిలో మృతి చెందిన ఎస్.గణపతి కటుంబ సభ్యులకు అటవీశాఖ డిప్యూటీ రెంజర్ రాకేష్‌కుమార్ రూ.5 లక్షల చెక్కును అందించారు. క్లష్టర్ ఇన్‌చార్జి మెదరమిట్టమోహన్‌నాయుడు, యూనిట్ ఇన్‌చార్జి నాగేశ్వరరావు, గిరేంద్రనాథ్,టీడీపీ నాయకులు నాగరాజునాయుడు, లోక, సుధాకర్‌రెడ్డి, రాజశేఖర్,జ్యోతీశ్వర్,కేశవులునాయుడు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ తగదు: భూమన



చిత్తూరులో వైసీపీ నాయకులు, కార్యకర్తల ర్యాలీ

చిత్తూరు రూరల్/గంగాధరనెల్లూరు/పూతలపట్టు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైసీపీ ఆధ్వర్యంలో బుధవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ జిల్లా అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ రంగ సంస్థలను తన కోటరీకి ధారాదత్తం చేసిన చంద్రబాబు ప్రస్తుతం మెడికల్ కాలేజీలను తన స్వప్రయోజనాలకోసం బినామీలకు ఇవ్వాలని చూస్తున్నారని ఆరోపించారు. ఆర్డీవో కార్యాలయ ఏవో మురళిమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప, నాయకులు పాల్గొన్నారు. గంగాధరనెల్లూరులో కృపాలక్ష్మి ఆధ్వర్యంలో మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, నియోజకవర్గ పరిశీలకులు రాజశేఖర్‌రెడ్డిలతో కలిసి భూమన ర్యాలీలో పాల్గొన్నారు. డీటీ మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు వైసీపీ నేతలు అనిత, వెంకటరెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, మునిరాజారెడ్డి, బలరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. పూతలపట్టులో ర్యాలీ నిర్వహించి తహశీల్దార్ రమేష్ బాబుకు వినతి పత్రం సమర్పించారు. మాజీ ఎమ్మెల్యేలు సునీల్ కుమార్, లలిత కుమారి, నాయకులు జగదీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేగంగా రోడ్డు పనులను పూర్తి చేయండి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కమిషనర్

చిత్తూరు అర్బన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలోని కోకావాండ్లపూరుకు వెళ్లే రోడ్డు పనులను వేగంగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఇంజనీరింగ్ అధికారులతో కలిసి రోడ్డు పనులను పరిశీలించారు. గ్రామస్థుల వినతి మేరకు కలెక్టర్, ఎమ్మెల్యేలు రోడ్డు నిర్మాణ పనులకు నిధులను మంజూరు చేశారు. చిత్తూరు-తిరుపతి ప్రధాన రహదారి నుంచి కోకావాండ్లపూరు వరకు 1.2 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. పనులను కమిషనర్ తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. కమిషనర్ వెంట ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఏసీపీ నాగేంద్ర, డీఈ రమణ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ సురక్ష యాప్‌పై అధికారులకు శిక్షణ

చిత్తూరు సిటీ, నవబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌పై, నేరాల హాట్‌స్పాట్స్ మద్యం దుకాణాల తనిఖీలపై ఎక్సైజ్ అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో చిత్తూరు, తిరుపతి జిల్లాల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డీసీ విజయ్ శేఖర్ అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో ఈఎస్ శ్రీనివాస్, ఏఈఎస్ క్రిష్ణకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఆర్‌టీ కేంద్రం సేవలపై ఆరా



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

బంగారుపాళ్యం,నవంబర్ 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని లింక్ ఏఆర్‌టీఈ కేంద్రాన్ని క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ కోటిరెడ్డి,ఐసీటీసీ సూపర్‌వైజర్ సురేంద్రబాబు బుధువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్ఐవీ,ఎయిడ్స్ రోగులతో ప్రేమగా మెలగాలని, వారికి సకాలంలో మందులు అందించాలని కౌన్సిలర్ బాబుకు సూచించారు. స్వచ్ఛంధ సేవా సంస్థల నుంచి కౌన్సిలింగ్ కేంద్రానికి వస్తున్నవారి సంఖ్య గురించి ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు.

శ్యామలాదేవికి మాజీ ఎమ్మెల్సీ నివాళి



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న బాలసుబ్రమణ్యం

శ్రీరంగరాజపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గంగమ్మగుడి గ్రామానికి విశ్రాంత టీచర్,రచయిత వడ్లపట్ల శ్యామలాదేవి అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందారు. ఈమె స్పందన ఫౌండేషన్ సంస్థ ద్వారా పేద విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేయడమేకాక పలు సేవ కార్యక్రమాలు చేశారు. మాజీ ఎమ్మెల్సీ విటపు బాలసుబ్రమణ్యం, విజయం విద్యా సంస్థల అధినేత తేజోమూర్తి దంపతులు పలువురు పూర్వ విద్యార్థులు ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె చిత్రపటంతో ర్యాలీ నిర్వహించారు. **చిత్తూరు సిటీ:** శ్యామలాదేవి మృతిపట్ల హరివిల్లు గౌరవాధ్యక్షులు హరినాయుడు, అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి మునస్వామి, నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం జిల్లా అధ్యక్షురాలు కరణం విమల, పలువురు కవులు, రచయితలు సంతాపం ప్రకటించారు.

మండల టీడీపీ నేతకు సన్మానం



వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

నింద్ర, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికై వెంకటేశ్వరరావు బుధవారం ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయనను పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తనకు పదవి రావడానికి సహకరించిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, ఎమ్మెల్యే భానుప్రకాష్, చినబాబు మండల నాయకులకు రుణపడి ఉంటానన్నారు.

దాడి కేసులో ముగ్గురికి రెండేళ్ల జైలు

పూతలపట్టు 12, (ఆంధ్రజ్యోతి): మహిళను దూషించి, దాడిచేసిన కేసులో ముగ్గురికి రెండేళ్ళ జైలు శిక్ష విధిస్తూ న్యాయస్థానం బుధవారం తీర్పు చెప్పింది. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం యాదమరి మండలం చిమ్మిరెడ్డిపల్లెకు చెందిన రాణికి కొంత పొలముంది. 2022 జనవరిలో ఆమె పొలంలో పనిచేసుకుంటుండగా మోతాండ్లపల్లెకి చెందిన యాదమూర్తి, నందకిషోర్, చందులు వచ్చి అడ్డుకున్నారు. దుర్భాషలాడారు. దాడికి పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేశారు. మొదటి అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ మాధవి ఈ కేసు విచారించి ముగ్గురు ముద్దాయిలకు రెండేళ్ళ జైలు శిక్ష విధిస్తూ బుధవారం తీర్పు చెప్పారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్టు

పాలసముద్రం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీకావేరిరాజుపురం డంపింగ్ యార్డు వద్ద అక్రమంగా మద్యం వవిక్రయిస్తున్న మునికృష్ణ(49)ను బుధవారం అరెస్టు చేసినట్లు పాలసముద్రం ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. 30 మద్యం బాటిళ్లను స్వాధీన పరచుకున్నామన్నారు

నింద్రలో పశు వైద్య సేవలు

నింద్ర, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. విశేష స్పందన లభించిందని సహాయ సంచాలకుడు మునిలక్ష్మిపతి తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు సాయిసౌందర్య(కొప్పేడు), వరప్రసాద్ (అగరం), పశు వైద్య సిబ్బంది ప్రభాకర్‌వర్మ, హరిప్రసాద్, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

నిషిధరాజుకు పార్టీ నాయకుల అభినందన

వెదురుకుప్పం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలిగా నియమితులైన నిషిధరాజును మండల పార్టీ నాయకులు బుధవారం కలసి అభినందనలు తెలిపారు. శాలువతో సత్కరించారు. నేతలు పాముల శేషాద్రికుమార్, బాలాజీరెడ్డి, సోమశేఖర్‌రాజు, శంకర్‌రెడ్డి, మాధవరెడ్డి, విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.